
# ముక్తికాంతా విలాసము

## యక్షగానము



మహాశ్రీ [illegible] ప్రణీతము

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# ముక్తికాంతా విలాసము

## యక్షగానము

**మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రణీతము**

సాధారణ సంపాదకుడు

**బి.యస్. రెడ్డి (భూమన్)**

సంచాలకుడు, తి.తి.దే. "శ్వేత" తిరుపతి

తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్ట్

Rs 15=00

పరిష్కర్త : ఆచార్య కె.జె.కృష్ణమూర్తి

తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్ట్

**తి.తి.దే."శ్వేత" తిరుపతి**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2008

# MUKTIKĀNTĀ VILĀSAMU
# YAKṢAGĀNAMU
# MĀTṚŚRĪ TARIGONḌA VENGAMĀMBA


Edited by
Prof. K.J.Krishnamoorthy
Tarigonḍa Vengamāmba Vāṅmaya Project
"SVETA",T.T.D., TIRUPATI.


T.T.D. Religious Publications Series No : 777

(c) All Rights Reserved
First Edition: 2008
Copies : 1,000

Published by
K.V.RAMANACHARY,I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
TIRUPATI-517 507

Printed at TTD.Press, Tirupati.





# "ఓం నమో వేంకటేశాయ"

# ముందు మాట

భూమన కరుణాకర రెడ్డి 03-05-2008.

అధ్యక్షులు,

తి. తి. దేవస్థాన పాలకమండలి,

తిరుపతి.

శ్రీనివాసుడు నిత్యకల్యాణ చక్రవర్తి. ఆ దేవదేవుణ్ణి ఉద్దేశించి వెలువడిన మధుర భక్తి సాహిత్యంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వరుసలో పేర్కొనదగిన మహనీయ కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. ఈ ప్రజాకవయిత్రి సామాన్యులకుసైతం సుకరంగా, ఆహ్లాదకరంగా తత్త్వ జ్ఞానాన్నీ, మధురభక్తి సందేశాన్నీ అందించడానికి 'యక్షగానం' మిక్కిలి అనువయిందిగా గుర్తించింది. వెంగమాంబ వెలయించిన తొమ్మిది యక్షగాన రూపకాల్లో చివరిది ఈ 'ముక్తికాంతా విలాసం'.

ఈ కథానాయకుడయిన జగదీశ్వరుడు (తరిగొండ లక్ష్మీనృసింహస్వామి)తన ప్రభుత్వాన్నంతా వేంకటరమణస్వామికి అప్పగించి ముక్తికాంతతో గూడి తిరుమలక్షేత్రంలో నెలకొనియున్నాడనీ, శ్రీవేంకటేశ్వరుడు భక్తి, జ్ఞానాలకు రెండింటికీ ప్రాతినిధ్యం వహించి అన్ని రకాల భక్తులనూ ఆదుకొంటూవున్నాడనీ కవయిత్రి ఈ నాటకంలో నిరూపించిన తీరు నిరుపమానమైనది!

ముఖ్యంగా, శ్రీనివాసుడు 'భక్తికాంత' - అనే పాత్ర మీదకు 'ఆవేశం'గా వచ్చి పల్కిన పల్కులు శ్రీవారితత్త్వాన్ని, మహత్త్వాన్ని గూర్చి ఈ కవయిత్రికి గల అనుభవపూర్వకమైన అవగాహనకు అక్షర నిదర్శనాలు!

తి.తి.దే- "శ్వేత" సంస్థ ఆధ్వర్యంలోని "తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు" ఇలాంటి విశిష్టప్రచురణలను ఇతోధికంగా చేపట్టి, ఈ పరమయోగిని సృష్టించిన వాఙ్మయ రాశిని విస్తృతంగా వెలుగులోకి తీసికొని రాగలరని ఆశిస్తూ, అభినందిస్తున్నాను.

శ్రీవారి సేవలో

భూమన కరుణాకర రెడ్డి

## "శ్రీనివాసో విజయతే"

## నా మాట

కె.వి.రమణాచారి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి. 02- 05-2008.

తరిగొండ వెంగమాంబ రచించిన యక్షగానాలన్నిటిలోనూ చివరిది 'ముక్తికాంతావిలాసం'.ఇందలి విషయం వేదాంతసంబంధి - అని ఈ రచనయొక్క పేరునుబట్టే వెల్లడవుతున్నది. 'జగదీశ్వరుడు' 'ముక్తికాంత'ను కలిసికోవడం ఇందులోని ప్రధాన కథాంశం.

ఈ కథానాయకుడైన జగదీశ్వరుడు (చిదచిదీశ్వరుడైన తరిగొండ నృసింహుడు) ఏడుకొండలపై వెలకొనియున్న ముక్తికాంతామందిరాన్ని ప్రవేశిస్తూ, తన ప్రభుత్వాన్నంతటినీ శ్రీవేంకటేశ్వరునికి అప్పగించాడని భక్తికాంత-అనే పాత్రచేత పల్కించడంద్వారా, ఈ అధ్యాత్మిక కవయిత్రి కలియుగదైవమయిన శ్రీనివాసుని అవతార మహత్త్వాన్నీ, తత్త్వాన్నీ స్వానుభవ పూర్వకంగా, సత్యసమ్మతంగా ప్రబోధించింది.

ఆళ్వార్లవంటి మనఃపరిపక్వత గలిగిన ఈ పరమయోగిని కృతులన్నింటిలోనూ మరుచిరమణిహారంలో సువర్ణసూత్రంవలె తాత్త్వికజ్ఞానం (Philosophy) భాసిస్తూవుండటం ముఖ్యంగా అభినందింపదగిన అపూర్వాంశం!

సులభమైన శిష్టవ్యావహారికంలో, మందరమైన శైలిలో, ఆహ్లాదకరమైన ఈ యక్షగాన రచనద్వారా తెనుగువారికి వేదాంత విజ్ఞానాన్ని అందించే పూనికలో కృతకృత్యురాలయిన ఈ "కవితా తపస్విని" యొక్క అనర్ఘకృతులన్నీ అచిరకాలంలో అక్షరాకృతిని పొందగలవని ఆశిస్తున్నాను; ఆంధ్రావళి ఈ కృతిద్వారా బ్రహ్మానంద సహోదరమైన కావ్యానందాన్ని పొందగలరని అభినందిస్తున్నాను.

సదా శ్రీనివాసుని సేవలో

తె.వి. రమణాచారి

# కవితా సౌందర్యం

"భూమన్" 01 -05 -2008.

సంచాలకులు,

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు,

"శ్వేత", తి. తి. దేవస్థానములు, తిరుపతి.

తరిగొండ వెంగమాంబ తాను పుట్టిన ప్రాంతానికీ, జీవించిన కాలానికీ అతీతంగా మనుగడ సాగించిన మహనీయురాలైన మహిళాశిరోమణి.

ఈ మహాకవయిత్రి రచించిన కృతులన్నీ సులభతరమైన శిష్టవ్యావహారిక భాషలో, సుందర శైలిలో విలసిల్లుతూ, పఠితలకూ, శ్రోతలకూ ఉదాత్తమైన ఆనందాన్నీ, ఉత్తమ సందేశాన్నీ అందిస్తూ అలరారుతున్నాయి. ఈ కారణంచేతనే ఈ భక్త కవయిత్రి క్రీ.శ. 18వ శతాబ్దిలో వర్ధిల్లిన "ప్రజాకవయిత్రి" గా పరిగణింపబడింది.

ఈ మహాకవయిత్రి వెలయించిన యక్షగానాల్లో చివరిది ఈ 'ముక్తికాంతా విలాసం'. పరిమితిలో చిన్నదయినా, ఇది మిగుల ప్రభావశాలియైన రచన.

'అమూర్తము' లైన (abstract) ముక్తి, జ్ఞానం, భక్తి, మాయ - మొదలైన వేదాంత శాస్త్ర సంబంధి విషయాలను సజీవ పాత్రలుగా రూపొందించి వెంగమాంబ ఈ నాటకాన్ని సరసములైన, సంభాషణలతో మనోజ్ఞమైన దేశీయ రూపకంగా సృష్టించింది.

స్వానుభవ జనితమైన అధ్యాత్మిక విజ్ఞానాన్ని సామాన్య జనులకు అందించాలనే ఉత్తమ ఆశయంతో కవయిత్రి ఈ కృతిని అత్యంత

సహజరీతిలో రచించింది. రసజ్ఞులు ఇందలి కవితా సౌందర్యాన్ని ఆస్వాదింపగలరని ఆశిస్తున్నాము, ఆకాంక్షిస్తున్నాము.

తి. తి. దే. "శ్వేత" సంస్థలోని 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు' ఈ కవయిత్రి యొక్క కృతులన్నిటినీ అచిరకాలంలోనే ప్రచురించే ప్రణాళికను సిద్ధ పరుస్తున్నదని తెలియ జేయటానికి సంతోషిస్తున్నాము; అలాగే ఆంధ్రావనిలో సాహిత్య ఉపన్యాసాలు, సంగీత ప్రదర్శనలు, హరికథలు - మొదలయిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటంద్వారా ఈ కవయిత్రి సారస్వతంయొక్క ప్రశస్తిని ప్రబోధించే ఉద్యమాన్ని తి.తి.దేవస్థానం తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టుద్వారా కొనసాగిస్తూవున్నదని తెలుపటానికి ఆనందిస్తున్నాము.

భూమన్

# పీఠిక

## పూర్వ రంగం:

వేదాంత విషయాలను సామాన్య ప్రజలకు సుకరంగా తెలియచేయటానికి భారతీయులు కనిపెట్టిన సాహితీ ప్రక్రియ ప్రతీకాత్మక నాటకం (Allegorical Drama). క్రీ.శ. 11వశతాబ్దికి చెందిన కృష్ణమిశ్రుడనే సంస్కృత కవి రచించిన 'ప్రబోధచంద్రోదయ' మనే రూపకం ఆ మార్గంలో మొట్టమొదటిదిగా భావింపబడుతున్నది. ఇది అద్వైత వేదాంతాన్ని బోధించే నాటకం.

క్రీ.శ. 14వ శతాబ్దిలో విలసిల్లిన శతాధిక గ్రంథకర్త, 'శ్రీమద్వేదాంత దేశికు'లనే నామధేయంతో ప్రశస్తి గాంచిన శ్రీమాన్ వేంకటనాథార్యులు రచించిన ' సంకల్ప సూర్యోదయము' విశిష్టాద్వైత వేదాంత ప్రతిపాదకమైన సుప్రసిద్ధమైన ప్రతీకాత్మక రూపకము. ఈ పద్ధతిలో మఱి కొన్ని రూపక రచనలు తరువాతి కాలాల్లో సంస్కృత సారస్వతంలో వెలువడ్డాయి.

తెలుగులో వెలువడిన ఇలాంటి ప్రతీకాత్మక కావ్యాల్లో మొట్టమొదటిది క్రీశ. పదునైదవశతాబ్దిలో నందిమల్లయ, ఘంటసింగయ - అనే జంట కవులు రచించిన ప్రబోధ చంద్రోదయం. దీనికి మూలం సంస్కృతంలో కృష్ణమిశ్రకవి రచించిన ప్రబోధచంద్రోదయమే! అయితే అది ఆనాటి ఆంధ్ర సారస్వత ప్రపంచంలో ప్రచురంగా వ్యాప్తిలో ఉండిన అభిరుచి ధర్మాన్ని అనుసరించి దృశ్యకావ్యంగా కాక, శ్రవ్య కావ్య మైన ప్రబంధంగా అవతరించింది.

ఈ ప్రతీకాత్మక పద్ధతి (allegorical method) లోనే ముక్తి, జీవుడు - మొదలయిన 'అమూర్తా' లైన(abstract) విషయాలను నాటకంలో పాత్రలుగా రూపొందించి వెలువరించిన దేశి రచనల్లో మొదటిది 'ముక్తికాంతా పరిణయం'. ఇది యక్షగానప్రాయమైన (యక్షగానంలాంటి) రచన.[1] దీని రచయిత పరమానంద తీర్థులు. ఈయన దత్తాత్రేయ సంప్రదాయ అనుసారియైన యతీశ్వరుడు. బహుగ్రంథ రచయిత.

1. చూ. ' ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర,' ద్వితీయ భాగము, పుటలు 25-26, డాక్టర్ యస్వీ జోగారావు, ఆంధ్రవిశ్వకళాపరిషత్ ప్రకాశితము (1961).

తంజావూరు జిల్లాలోని మన్నారుగుడి (దక్షిణ ద్వారక) అనే పుణ్యక్షేత్రంలో క్రీ.శ. పదహారవ శతాబ్ది ఉత్తరార్ధంలో నివసించాడు. సచ్చిదానంద పురాధీశ్వరుని పుత్రికయైన 'మోక్షకన్యక' స్వయవరంలోని వివిధ మతాధిపతులను నిరాకరించి, వేదాంత మతస్థుడైన 'వివేక జీవేశ్వరుణ్ణి' వరించటం ఈయన ముక్తికాంతపరిణయంలోని విషయం.

ముక్తికాంతయొక్క వృత్తాంతం ఆధారంగా క్రీశ. పదునెనిమిదవ శతాబ్ది ఉత్తారార్ధంలో తిరుమల పుణ్యక్షేత్రంలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ లేఖిని నుండి వెలువడిన స్వతంత్ర కృతి 'ముక్తికాంత విలాసం'. ఈ యిరువురి రచనలలోనూ 'ముక్తికాంత'కు ప్రాధాన్యం గోచరిస్తున్నప్పటికీ, కథాకల్పనలోనూ, రచనా విన్యాసంలోనూ ఈ రెండు రచనలకు ఎలాంటి పోలికలు లేవు. తీర్థుల రచనలో మోక్షకన్యక యొక్క పరిణయం ప్రముఖమైన అంశం కాగా, వెంగమాంబ రచనలో ముక్తికాంత యొక్క విలాసం (వైభవం) ప్రధానమై విలసిల్లినది.

కథాస్వరూపం:

సృష్టి, స్థితి, లయములనే జగద్వ్యాపారములను నిర్వహించే జగదీశ్వరుడు ఒకనాడు ముక్తికాంత నివసిస్తూవున్న మందిరం వద్దకు వెళ్లి, అచ్చటి దార్వాపాలకుల్లో ఒకణ్ణి (విచారాత్మకుణ్ణి) పిలిచి, తలుపు తీయ గోరుతాడు. వాడు స్వామివారి పేరు, వచ్చిన కారణం మొదలైన విషయాలను గూర్చి తెలిసికొని, ఇలా సమాధాన మిస్తాడు:

'స్వామీ! మీరు మాయ అనే తెరను తొలగించుకొని ఈవలకు వస్తే, ముక్తికాంత మందిరంలో ప్రవేశించవచ్చును'. స్వామివారు అతడు చెప్పినట్లే చేయగా, ఆ ద్వారపాలకుడు ముక్తికాంత అంతఃపురమందిరం యొక్క మొదటి కవాటాన్ని తీస్తాడు. స్వామి అందులో ప్రవేశించి ముందుకు వెళ్లుతూవుండగా, అచ్చటి ద్వారపాలకులంతా భక్తి గౌరవాలతో స్వామివారికి హెచ్చరికలు, పరాకులు పలికిస్తారు.

ముక్తికాంతయొక్క ముఖ్యపరిచారిక యైన జ్ఞానకాంత ఆ సమయంలో స్వామివారు లోపలి మందిరంలో ప్రవేశింపకుండా రెండవద్వారంయొక్క కవాటాన్ని మూసివేస్తుంది. తాను ముక్తికాంతను వలచి రాగా, ఆ విధంగా

కవాటాన్ని బంధించటం తగదని స్వామి జ్ఞానకాంతతో అంటారు. ముక్తికాంత నిర్వికల్ప సమాధి నిష్ఠలో నిమగ్నురాలై వున్నది గనుక, స్వామివారు సకల పరివారంతో సందడి చేస్తూ వెళ్లరాదని జ్ఞానకాంత లోపలనుంచే సమాధానమిస్తుంది. అంతలో అక్కడకు భక్తికాంత వచ్చి, జీవుణ్ణి పరీక్షించిన రీతిగా ఈశ్వరుణ్ణి పరీక్షించడం తగదని జ్ఞానకాంతను మందలిస్తుంది.

'మాయాశక్తితో కూడి వున్నందుచేత ఆయనను పరీక్షింపకుండా లోపలికి విడువను' - అని ఖండితంగా పల్కి, జ్ఞానకాంత వైరాగ్య కాంతను రహస్యంగా పిలిచి, పరీక్షింపుమని ఆదేశిస్తుంది. అప్పుడు ఆవైరాగ్యశక్తి వివేకశక్తి యొక్క సహాయంతో "నేతి నేతి వాక్యాలు"- అనే భటులచేత స్వామివారి పరివారాన్ని (త్రిగుణాదులు, వాటి కార్యాలు మొదలైనవాటిని) తీవ్రంగా తొలగద్రోయిస్తుంది. అయినా, జగదీశ్వరుడు నిర్వికారుడై, పరమశాంతి వహించివుంటారు. 'స్వామివారిని ఇంకా పరీక్షిస్తూవున్నావా?' అని భక్తికాంతను గద్దిస్తుంది.

'నవ్వుటాలకు పరీక్షస్తానని పల్కినానేగాని, నిజంగా ఈ దేవుణ్ణి ఎవరు పరీక్షింపగలరు?'- అని చెపుతూ,జ్ఞానకాంత ముక్తికాంత పేరిట జాబు వ్రాసి, శ్రద్ధ అనే శక్తి ద్వారా స్వామివారి సన్నిధికి పంపుతుంది. ఆ జాబును భక్తికాంత చదివి వినిపించగా విని, స్వామి ఇచ్ఛా శక్తిచేత ప్రత్యుత్తరం వ్రాయించి ముక్తికాంతకు పంపిస్తారు. స్వామి పంపిన ఆ ప్రత్యుత్తరాన్ని జ్ఞానకాంత ముక్తికాంత సమక్షంలో చదివి వినిపిస్తుంది. ఈ విధంగా నాయికా నాయకుల మధ్య మూడు ప్రత్యుత్తరాలు నడచిన అనంతరం ముక్తికాంత రెండవ కవాటాన్ని తీయడానికి ఆదేశిస్తుంది. అంతట విచారాత్మకుడనే ద్వారాపాలుడు పరిహాససూచకంగా, చమత్కారంగా మాట్లాడుతూ రెండవ కవాటాన్ని తెరుస్తాడు.

స్వామి ద్వితీయ కవాటాన్ని దాటి దాటి వెళ్తూవుండగా, ముక్తికాంత మూడవ కవాటాన్ని మూసివేస్తుంది. అప్పుడు ముక్తికాంతకు జగదీశ్వరునకు ఏలలలో ప్రశ్నోత్తర రూపేణ సంభాషణ సాగుతుంది. చిట్ట చివరకు ముక్తికాంత జగదీశ్వరుని సమాధానాలకు సంతోషించి, లోపలి కవాటాన్ని తీసి, ఆ దేవ దేవునితో కలసిమెలసివుంటుంది. ఆ దివ్య దంపతులకు భక్తి, జ్ఞాన,

వైరాగ్యశక్తులు మంగళ గీతాలను ఆలాపిస్తూ హారతు లిస్తారు.

జగదీశ్వరుడు ముక్తిసతిని కూడుకొని నిస్పృహుడై వున్నందువల్ల ఎక్కడి సృష్టి అక్కడ నిలిచిపోతుంది. అందుకు మిక్కిలి చింతిస్తూ మాయాశక్తి చిత్త సఖితో కూడి, జ్ఞాన, వైరాగ్య, భక్తికాంతలు ఉండే చోటికి వచ్చి 'నా నాథుడైన జగదీశ్వరుడు ఎక్కడ ఉన్నాడో తెల్పం'డని వాళ్ళను మంచిగా అడుగుతుంది.

మాయాశక్తి వాళ్లవల్ల సరియైన సమాధానాన్ని పొందజాలక దిగులు పడుతుంది. తన బిడ్డలను (త్రిగుణములు, అరిషడ్వర్గములు మున్నగు పరివారాన్ని) చెఱబెట్టుకొనిన వైరాగ్యశక్తిపై మాయాశక్తి విఱుచుకపడుతుంది. ఆ సమయాన జ్ఞానశక్తి వైరాగ్యశక్తిని అవల నుంచి, మాయాశక్తితో పలు విధాలుగా వాదించి, గెలిచి, తరుముతుంది.

అలా మాయాశక్తిని తరుముతూవున్నంతలో భక్తికాంత అడ్డం వచ్చి 'పిచ్చుక మీద బ్రహ్మాస్త్ర మెందులకు?'- అని పలికి జ్ఞానకాంతను సముదాయిస్తుంది. అటుపిదప మాయాశక్తి వైపు మరలి "ఓ మాయా! నీ నాథుడైన జగదీశ్వరుడు ఏడుకొండలపై గల ముక్తిమందిరంలో ప్రవేశిస్తూ, తన ప్రభుత్వాన్ని అంతటినీ శ్రీవేంకటేశ్వరునికి అప్పగించాడు. కాబట్టి నీవు ఆస్వామిని శరణుపొందితే నీ బిడ్డలు ఉండే చోటు చెప్పి, నిన్ను తనవశం చేసికొని రక్షిస్తాడు"- అని ఊరడిస్తుంది. ఇలా ఓదార్చి భక్తికాంత మాయను శ్రీస్వామివారి సన్నిధికి పిలుచుకొనిపోతుంది.

ఆ సందర్భంలో మాయాశక్తి ఆర్తితో స్వామిని సంప్రార్థిస్తుంది. తత్ఫలితంగా శ్రీనివాసుడు భక్తికాంతపై "ఆవేశం"గా వచ్చి మాయ యొక్క భయ, సందేహాలను తీర్చి, ఓదార్చి పంపిస్తాడు.మిగిలిన జ్ఞానశక్తి, వైరాగ్యశక్తి, భక్తికాంత, వివేకశక్తి స్వామివారి సన్నిధిలోనే నెలకొనివుంటారు. వైరాగ్యశక్తి స్వామివారికి హారతి యిస్తూ మంగళములు పాడుతుంది. వేంకటేశ్వరుడు భక్తికాంతపై నున్న తన "ఆవేశాన్ని" ఉపసంహరించి, స్వస్వరూపాన్ని అవధరించి సమస్తపరివారంతో గూడి లోకాలను పరిపాలిస్తూవుంటాడు.

**కృతివైశిష్ట్యం:**

ఈ యక్షగానం ఈ ఆధ్యాత్మిక కవయిత్రియొక్క అనుభవంనుండి అపూర్వంగా జాలువారిన విశిష్టమైన రచన! ఇందలి విషయం తాత్త్వికమైనప్పటికీ రచనాసరణి అంతా 'శృంగారం'గా చక్కని గేయాలతో, తలుపు దగ్గరి సంభాషణలతో, ఒకదాని వెంట మఱియొకటిగా కొనసాగిన ఉత్తర ప్రత్యుత్తరాలతో, మిగుల నాటకీయంగా, 'లలిత'మైన, సరసమైన 'శృంగార సత్కృతి'గా అవతరించింది. వెంగమాంబకు పూర్వం తెలుగుసాహిత్యంలో ఈ నామధేయంతో, ఇలాంటి ఇతివృత్తం గల రచన మఱొకటి ఏదీ వెలువడలేదు. ఇది దీని ప్రత్యేకత. వెంగమాంబ దీనిని తన గురువర్యుడయిన సుబ్రహ్మణ్య యోగికి అంకితం కావించింది.

ఈ యక్షగానంలోని కథా కల్పనకు సంబంధించిన ముఖ్యాంశం ఒకటి ఈ సందర్భంలో పేర్కొనదగివుంది:- కథా నాయకుడైన జగదీశ్వరుడు ముక్తి కాంతను కూడుకొనిన అనంతరం భక్తి, జ్ఞాన, వైరాగ్య కాంతలు ఆ దివ్య దంపతులకు 'మంగళముల'ను ఆలాపిస్తారు. ఈ నాటకాన్ని మొదటిసారిగా పఠించేవారికి ఇంతటిలో ఈ కృతి పూర్తయినదనే అభిప్రాయం కలుగుతుంది. కాని-

క.　　అని వా రారతు లిచ్చిన
　　వెనుకను దరిగొండ పురిని వెలసిన మోక్షం
　　గన నహి పర్వతమునఁ జే
　　కొని జగదీశ్వరుండు దానిఁ గూడి సుఖించెన్.

ప.39

ద్విపద.శ్రీకర చరితుండు - చిదచిదీశ్వరుఁడు
　　ప్రాకట తరిగొండ - పట్టణాధిపుఁడు

　　తానైన శేషాద్రి - ధాముని చెంత
　　సానందుఁడై మహా - జగదీశ్వరుండు

　　ముమ్మూల కోనలో - మోక్షకామినిని
　　నెమ్మదిగాఁ గూడి - నిస్పృహుండయ్యె.　పుట 32

అప్పు డెక్కడి సృష్టి - యక్కడ నిలిచె,
నొప్పుగా సకల జీ - వులు జ్ఞాను లగుచు

ఘనమైన మోక్షమా -ర్గముఁ జూచుటెఱిఁగి
తనలోనఁ దానిట్లు - దలఁచె నమ్మాయ" -

పుట

అని కవయిత్రి కథాక్రమాన్ని కొనసాగించటాన్ని బట్టి చూస్తే, ఇది ఈ యక్షగానంలోని రెండవ భాగంగా స్ఫురిస్తుంది. ఈ ద్వితీయభాగం భక్తికాంత మీద "ఆవేశమై" ఉన్న వేంకటేశ్వరస్వామికి మంగళహారతు లిచ్చి స్తుతించటంలో ముగుస్తున్నది. ఈ రెండవ భాగాన్ని "భక్తికాంతా విలాసం"- అని ( కవయిత్రి పేర్కొనక పోయినప్పటికీ) పేరుపెట్ట వచ్చు.

ముక్తికాంతా విలాసం మొదటి భాగంలో జగదీశ్వరుని (కథానాయకుని) వెంట ముక్తికాంత మందిరంవరకు వచ్చి, వైరాగ్య శక్తిచే అవతలకు త్రోసివేయబడిన 'త్రిగుణములు' - మొదలైన పరివారం యొక్క తదనంతర వృత్తాంతాలు, వారి తల్లియైన మాయాశక్తిని శ్రీనివాసుడు ఆదరించటం - ఇత్యాది విశేషాలు రెండవ భాగంలో తెల్పబడివుండటంవల్ల, ఈ రెండవ భాగం మొదటి భాగంయొక్క అనుబంధకథగా భాసిస్తూవుంది. ఈ రీతిగా ఈ రెండు భాగాలకు చక్కని సమన్వయాన్ని సాధించి వుండటంచేత ఈ మొత్తం గ్రంథానికి "ముక్తికాంతా విలాస" మనే నామధేయం సర్వవిధాలా సార్థకమై వెలసింది.

కావ్యసందేశం:

ఈ కృతియొక్క మొదటి భాగంలో తరిగొండ లక్ష్మీనృసింహుడు జ్ఞానస్వరూపుడయిన, విరక్తుడయిన యోగి యనీ, అలాగే రెండవ భాగంలో శ్రీవేంకటేశ్వరుడు భక్తిప్రధానుడూ, విశ్వసంసార రక్షుడూ నయిన భోగియనీ లోకవ్యవహార దృష్టిని అనుసరించి సూచింపబడింది. ఈ యిద్దరికీ అభిన్నుడైన జగదీశ్వరుడు ఇందులో నాయకుడై యుండి ముక్తికాంతను కలిసికొని వుండటమనే ఇందలి ప్రధాన కథాంశం ద్వారా భక్తి, జ్ఞానాల సమన్వయమే ముక్తి-అనే ఆధ్యాత్మిక సత్యం వెల్లడౌతున్నది.

శ్రీనివాస పదభక్తివల్ల జీవులంతా, జ్ఞాన, వివేక, వైరాగ్యదులను సాధించి, మాయను దాటి, మోక్షాన్ని అందుకోగలరు - అనే అద్వితీయమైన సందేశం ఈ ఆధ్యాత్మిక కావ్యంద్వారా లోకానికి వెల్లడికావింపబడింది. మొత్తంమీద ఈ యక్షగానం "సకల తత్వార్థవివేకిని", "కవితా తపస్విని" యై విలసిల్లిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారి ఆధ్యాత్మిక విజ్ఞానం, కవితా కౌశలం సమగ్రంగా సంగమించిన సారస్వత తీర్థంగా విరాజిల్లుతూవుంది!

పరిష్కరణ:

ఈ గ్రంథ పరిష్కరణలో ఉపయోగింపబడిన ప్రతులు రెండు: అందులో ఒకటి తాళపత్ర ప్రతి. ఇది తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం (డీమ్డ్ యూనివర్సిటీ) గ్రంథాలయంలో ఉంది. దీని సంఖ్య 3502. ఈ తాళపత్ర ప్రతిలో 26 ఆకులు ఉన్నాయి. దీని వ్రాయసకాడు శేషాచలం పిళ్ల. తిరుపతిలో కృష్ణాపురం పాలెగాళ్ల సంప్రతిగా ఉండిన ఇతడు క్రీశ. 1848వ సంవత్సరంలో మాతృకను పట్టి (అనగా వెంగమాంబ కాలంనాటి మూలప్రతిని చూచి) ఈ తాళపత్ర ప్రతిని లిఖించియున్నారు. ఈ పరిష్కరణలో ఇది ప్రధానప్రతిగా స్వీకరింపబడింది. ఈ ప్రధానప్రతికి "శ" - అనే సంకేతం (గుర్తు) ఉంచబడింది.

ఈ పరిష్కరణంలో ఉపయోగింపబడిన రెండవప్రతి ముద్రిత ప్రతి. ఇది. క్రీశ. 1904లో చెన్నపురి శ్రీరాజరాజేశ్వరీ నికేతన ముద్రాక్షర శాలలో ('వేదాంత జ్ఞాన బోధిని' - అనే సంకలన గ్రంథంలో) ముద్రింపబడింది. ఈ రెండవ ప్రతికి "ర" - అనే గుర్తు ఉంచబడింది.

ప్రధానప్రతియందలి లేఖన దోషాలను సవరించి, -కవయిత్రి ప్రయోగించిన భాషాస్వరూపాన్ని దృష్టిలో నిడుకొని-ఛందో, భాషా లక్షణానుసారంగా "ప్రెస్ కాపీ" తయారుచేయబడింది. అనంతరం 'ర' ప్రతిలో లభించిన సముచితములైన పాఠాంతరాలను గుర్తించి, వాటిని అధో జ్ఞాపిక (foot notes)లో 'ర' అనే సంకేతంతో ఇవ్వడం జరిగింది. ఒక్కొక్క చోట ప్రధాన ప్రతిలోని పాఠంకన్నా 'ర' ప్రతిలోని పాఠం మేలైనదిగానూ, వెంగమాంబ భాషాస్వరూపానికి సన్నిహితంగా నూ గోచరించిన చోట ఆ పాఠాన్ని గ్రంథం (Text) లోనికి స్వీకరించి, ప్రధాన

ప్రతిలోని పాఠాన్ని 'శ' గుర్తుతో అధోజ్ఞాపికలో గుర్తించడం జరిగింది. మొత్తం మీద ఇందులో పాఠభేదాలు అధికంగా లేక పోవడం - అవే కారణంచేత ప్రకృత ప్రచురణ ఈ కవయిత్రి ప్రయోగించిన భాషాస్వరూపానికి మిక్కిలిసన్నిహితమై, అత్యంతసహజంగా అలరారుతూవుందని చెప్పగలము.

ఈ సందర్భంలో ముక్తికాంతా విలాసానికి సంబంధించిన ఇంకొక ముద్రితప్రతినిగూర్చి కూడా ప్రస్తావింపవలసివుంది. ఈ ముద్రిత ప్రతి తి.తి.దే. శాసన పరిశోధకుడుగా సుగృహీతనామధేయుడైన కీ.శే. సాధు సుబ్రహ్మణ్య శాస్త్రి గారి వద్ద ఉండింది. ఇది మిగుల ప్రాతబడిన గుజిలీ ప్రతి. దీని మొదట, చివర కొన్ని పుటలు లేవు. పరిష్కరణలో ఉపయుక్తాలైన పై రెండు ప్రతుల కన్నా పేర్కొన దగ్గ పాఠాంతరాలు ఈ గుజిలీ ప్రతిలో లభించక పోయినా, తరిగొండ వెంగమాంబ రచనలకు ఆనాటి సమాజంలో నెలకొని యుండిన పూజ్యభావనను వెల్లడించే అక్షర నిదర్శనంగా ఈ గుజిలీ ప్రతి ప్రాముఖ్యాన్ని సంతరించుకొన్నది.

నేటికి దాదాపు 80సంవత్సరాలక్రితం తిరుపతి క్రొత్త వీధిలో నివసించే వైశ్యశ్రేష్ఠులు కొందరు అమావాస్యా సోమవారవ్రతాన్ని ఆచరిస్తూ, ఆవ్రతం సందర్భాన దానం చెయ్యడానికి తరిగొండ వెంగమాంబ రచనల్లో ఒకటైన ముక్తికాంతావిలాసాన్ని ఎన్నుకొని, స్వయంగా ముద్రించి, అందరికీ దానం చేశారట! సుబ్రహ్మణ్యశాస్త్రి గారి వద్దనున్న గుజిలీ ప్రతి అలా ఇవ్వబడినదే! ఈ విషయాన్ని సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ధర్మపత్ని కీ.శే. సాధు వెంకటలక్ష్మమ్మ గారు ఈ పరిష్కర్తకు తెల్పియున్నారు.

ఈ అంశాన్ని బట్టి, తరిగొండ వెంగమాంబ రచనల యెడల నాటి ప్రజానీకంలో నెలకొని యుండిన భక్తి ప్రపత్తులు ప్రకటమవుతూ వున్నాయి.

తిరుపతి వాస్తవ్యులైన ఆనాటివాళ్లు ముక్తికాంతవిలాసాన్నే ముద్రించటానికి సంకల్పించడంలో ఈ కవయిత్రి తెల్పినట్లు "ఇది పఠించిన వారు, నిది విన్నవారు సదరక మోక్షర్మలి సుఖింపుదురు", అన్న దృఢ విశ్వాసమే ప్రోత్సాహకమై వెలసిందని విశ్వసింపవచ్చు!

# కృతజ్ఞతాంజలి

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టును నెలకొల్పటంలోనూ, దానికి శాశ్వత స్థితిని ప్రసాదించటంలోనూ ఆదినుండీ మూలవిరాట్టుగా విలసిల్లుతూవున్న శ్రీవారి ప్రతినిధులు,సహృదయ సతంములు, సుగృహీత నామధేయులు, పరిపాలనా దక్షులు, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి అధ్యక్షవర్యులు శ్రీభూమన కరుణాకరరెడ్డి మహోదయులకు, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యులెల్లరకు నా అనేక ధన్యవాదములు.

శ్రీవారి ప్రతినిధులు స్మితపూర్వభాషులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుకు చిరస్థాయి యయిన అభ్యుదయాన్ని, సమగ్రతను ప్రసాదిస్తూవున్న సహృదయతంములు తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారివర్యులు, పరిపాలనాదక్షులు, సుగృహీత నామధేయులు శ్రీ కె.వి. రమణాచారి, ఐ.ఏ. యస్., మహోదయులకు నా అనేక ధన్యవాదములు.

తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి, సౌజన్యహృదయులు శ్రీ ఎ.వి. ధర్మారెడ్డి గారికి నా అనేక ధన్యవాదములు.

మాతృశ్రీ తరిగొండ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుయొక్క సర్వతోముఖమైన వికాసానికి తమ వ్యక్తిత్వ లక్షణమైన ఉద్యమస్ఫూర్తిని సమన్వయించి ఉత్సాహ, ప్రభు, మంత్రశక్తి పూరితమైన దక్షతతో ముందుకు నడిపిస్తూ వున్న తి.తి.దే. "శ్వేత" సంచాలకులు, "భూమన్" గా సుగృహీతనామధేయులైన శ్రీ భూమన్ సుబ్రహ్మణ్యం రెడ్డి మహోదయులకు నా అనేక హృదయపూర్వక ధన్యవాదములు.

తి.తి.దే. పౌరసంబంధాధికారివర్యులు, సరసహృదయులు శ్రీయుతులు కె. రామపుల్లారెడ్డిగారికి నా అనేక కృతజ్ఞతాభివాదములు.

సహృదయులు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయపాఠ్య సమన్వయకర్త ఇన్‌ఛార్జ్ విద్వాన్ డా॥ సమిడికాల్వ చెంచుసుబ్బయ్య గారికి హార్దమైన నా కృతజ్ఞతాభివందనములు.

"శ్వేత" కేంద్రగ్రంథాలయం లైబ్రేరియన్ సోదరీమణి శ్రీమతి ఎస్. లీలావతి గారికి, వారి సహోద్యోగులయిన మిత్రబృంద మందరికీ - "శ్వేత" సంస్థ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీ వి. దామోదరంగారికి, శ్రీదీనదయాళ్(యు.డి.సి.)గారికి వారి సహోద్యోగబృందమందరికీ, ముఖ్యముగా సహృదయమిత్రుడు శ్రీ జి. సురేశ్‌కుమార్ (యు.డి.సి.)గారికి నా అనేక కృతజ్ఞతాభివందనములు.

ఈ పుస్తకమును ముచ్చటగా ముద్రించిన తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రణాలయ అధికారులకు నా కృతజ్ఞతాభివందనములు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబా మహాకవయిత్రియొక్క ఆరాధ్యదైవమయిన "శ్రీ తరిగొండ శేషకుధరాధ్యక్షు"నకు నా భక్తి పూర్వక ప్రసూనాంజలి.

కె. జె. కృష్ణమూర్తి

# విషయ సూచిక


| | |
|---|---|
| ముందుమాట | iii |
| నామాట | v |
| కవితా సౌందర్యం | vii |
| పీఠిక | ix |
| కృతజ్ఞతాంజలి | xvii |
| కథోపక్రమము | 1 |
| జగదీశ్వరుని రాక | 2 |
| జగదీశ్వరుఁడు - ద్వారపాలకుఁడు | 3 |
| జగదీశ్వరుఁడు - జ్ఞానకాంత | 6 |
| భక్తికాంత - జ్ఞానకాంత | 11 |
| ముక్తికాంత లేఖ | 15 |
| జగదీశ్వరుని ప్రత్యుత్తరము | 17 |
| ముక్తికాంత ప్రత్యుత్తరము | 20 |
| జగదీశ్వరస్వామి రెండవ ప్రత్యుత్తరము | 21 |
| ముక్తికాంత రెండవ ప్రత్యుత్తరము | 24 |
| జగదీశ్వరుని మూఁడవ ప్రత్యుత్తరము | 25 |

| | |
|---|---|
| చిదాత్మకుని హాస్యోక్తులు | 26 |
| జగదీశ్వరుఁడు - ముక్తికాంత | 28 |
| మంగళములు | 31 |
| మాయాశక్తి నాథుని వెదకుచువచ్చుట | 33 |
| వైరాగ్యశక్తి - మాయాశక్తి | 35 |
| మాయాశక్తి -వైరాగ్యశక్తితో వాదించుట | 40 |
| జ్ఞానకాంత మాయను తఱుముట | 43 |
| మాయాశక్తి వేంకటేశ్వరునిఁ బ్రార్థించుట | 45 |
| శ్రీనివాసస్వామి "యావేశము"- ఉపదేశము | 46 |
| జ్ఞానవైరాగ్యశక్తులు స్వామిని స్తుతించుట | 47 |
| మాయా తత్త్వము | 48 |
| శ్రీనివాసుని సందేశము | 49 |
| వైరాగ్యశక్తి విన్నపము | 51 |
| మంగళములు | 53 |
| అంకితము | 55 |

# ముక్తికాంతా విలాసము
## యక్షగానము

తే.గీ. శ్రీకరముగాను తరిగొండ శ్రీనృసింహుఁ
డైన శేషాచలేంద్రుని యనుమతమున
[1]లలితమగు ముక్తి కాంతావిలాసకృతిని
వెలయ రచియించెఁ దరిగొండ వెంగమాంబ. 1

## + కథోపక్రమము +

వ. తత్కథోపక్రమం బెట్టిదనిన. 2

ద్విపద. శ్రీవిష్ణునాథుని - క్షేత్రపాలకుని
భావించి, దుర్గను, - ఫణిరాజ ధరుని,

శ్రీవాణి, నా విరిం - చిని, హయాననుని
భావించి, చౌడమాం - బను, సిరిస్ వినుతి

గావించి, యా నవ - గ్రహములఁ దలఁచి,
పావనాత్మకుని సు - బ్రహ్మణ్యగురునిఁ

దలఁచి తత్పాద ప -ద్మము లాశ్రయించి,
లలి ముక్తి కాంతా వి - లాస సత్కృతిని

శృంగారముగ విర - చించి, మోక్షంబు
నంగీకరించి మ - హాగురుండైన

1. లలితమగ ముక్తికాంతా విలాసకృతియు - శ

హరి కర్పితముఁ జేసె; - నా కథాక్రమము
సరసాత్ములైన స - జ్జనులెల్ల వినుఁడి!

వ. అది యెట్లనిన నిత్య శుద్ధ బుద్ధ సచ్చిదానంద సత్యజ్ఞానానంత పరిపూర్ణ బ్రహ్మచైతన్యాంబరంబునం దొక్క దిక్కు గగనంబున మేఘంబావరించిన చందంబున మాయావరణశక్తియావరింపఁగాఁ,దన్మ ధ్య చైత న్యంబు నందు విక్షేపశక్తి ప్రకాశింపఁగా,నా చైతన్యంబు నే నీశ్వరుండనని తలంచి, యనాది త్రిగుణాత్మకంబైన మూలప్రకృతియందుఁ బ్రవేశింపఁగా, నా యీశ్వరు కళ లనేకంబులై యుదయించి విద్యాఽవిద్యా కలితంబులై యనేక జీవ సమూహంబు లయ్యె. తన్మూలంబున నయ్యీశ్వరుం డుత్పత్తి స్థితి లయ వ్యాపారంబులఁ గల్పించి,ప్రకృతి పురుషాత్మకంబుగాఁబ్రపంచం బును వృద్ధిఁ బొందించి,సర్వస్వతంత్రుండై, బహుశక్తియుక్తుండై [2]క్రీడింపు చుండి, తదనంతరంబున. 3

## + జగదీశ్వరుని రాక +

ద్విపద. శ్రీకరచరితుఁ డా - శ్రిత జనావనుఁడు
ప్రాకటనిర్వాణ - పదదాయకుండు

సర్వతోముఖుఁడు భా - స్వర యశోధనుఁడు
సర్వస్వతంత్రుండు - జగదీశ్వరుండు

సకల విశ్వమును ము - చ్చటగా రచించి
యకలంకుఁడై యుండి - యట నొక్కనాఁడు

తరిగొండ నరసింహ - దగ్గర నిలిచి
[3]మురియుచున్నటువంటి - మోక్షకామినిని

2. క్రీడించుచున్న సమయంబున - ర
3. మురియుచున్నట్టి యా మోక్షకామినిని - ర

తాను( బొందుటకు( జి - త్తమున నూహించి
యానంద పరవశుం - డై వేడ్క నపుడు.

## దరువు. ఆదితాళం

వచ్చె నాది పూరుషూ(డు - హెచ్చియున్న ముదమువాడల్లవి॥

మెచ్చి ముక్తి కాంతాను - మేలిమీగ( గను(గొనా
వచ్చె నాది పూరుషూ(డు ॥ఉపపల్లవి॥

మునుకోని మునిగణ - మూలు వినుతింపా(గా
అనిమీష లనిమేష - లై గనుచుండా(గా ॥వచ్చె॥ ౧

అప్రమేయూ( డీత(డాని - 'యార్యులెల్లా( బొగడ(గా
స్వప్రకాశు(డై సమస్త - జనమూలు జూడ(గా ॥వచ్చె॥ ౨

వరతారిగొంఠ పూర - వాసూని చెంగటాను
మురియూచు వసించియున్నా - ముక్తి సతిని( బొందానూ
॥వచ్చె॥ ౩

## + జగదీశ్వరు(డు – ద్వారపాలకు(డు +

వ. అట్లు వచ్చిన స్వామి ముక్తిమందిర ద్వారపాలకులలో నొకని( బిలిచి 'యహెూ ద్వారపాలకా! మోక్షపతిని( జూడవచ్చితి. నీ వీ కవాటంబు( దియ్యరా!' యనిన ద్వారపాలకుం డిట్లనుచున్నా(డు:

ద్వార: అహెూ! స్వామీ! మోక్షమందిర ద్వారకవాటంబు( దియ్య
మంటివి గదా! మఱి నీ వెవ్వరైనది తెలుపవయ్యా?

---

4. యార్యులెల్ల - ర

జగ: నేను జగదీశ్వరుండనురా! వోరీ ద్వారపాలకా!

ద్వార: 'నీవు జగదీశ్వరుండవైతే జగంబుల నేలుచుండవలెఁ గాని, యిక్కడికి యేల వచ్చినావయ్యా? స్వామీ!'
అనఁగా నయ్యీశ్వరుం డిట్లనుచున్నాఁడు: 4

జగ: తే.గీ. ద్వారపాలక! మోక్షసుందరిని వలచి
వచ్చి తిచటికి, నీ వీ కవాట మిపుడు
తియ్యరా! జాగుసేయక నెయ్య మలర
వరము లిచ్చెద నీకు సత్కరుణమీఱ. 5

వ. అనిన విని వాఁ డిట్లనుచున్నాఁడు:

ద్వార: అహో స్వామీ! నీవు వరము లిచ్చెద నంటేని, యిట్టివరంబులు నేను కోరితినేని ముక్తి కెడమై పోవలసివచ్చునుగాన, నా మనస్సునఁ గో రికలు లేవు గనుక, నీ విచ్చెడు వరంబులు నే నొల్లను. కోరికలన్నియు మోక్షవిరోధములు గనుక, నేను నిష్కామినై యున్నాను.ముక్తినిఁ బొందెద ననెడు కోరిక నీ కున్నది. నా కదియును లేదు. కాఁగా, నే నే దొడ్డవాఁడనని తోఁచియున్నది.

నీవీశ్వరుండవై యనేక జీవులనెడు బిడ్డలఁ గని దొడ్డ సంసారి వైతివి. ఇప్పుడుమాయావరణమనే తెరలో నున్నావు గనుక, ముక్తికాంత చెంతకు రాకూడదు. నీ వీ మాయావరణంబులఁ గడచి యీవల వచ్చితివేని ముక్తిమందిరంబునకుఁ బోవచ్చును గనుక, నీ వీవల రమ్ము.

అనఁగా సమ్మతించి. 6

## దరువు. ఆది తాళం

దేవుఁడందు మఱపనే - తెరను తెగఁదీసెనూ ॥పల్లవి॥
పావన నిర్వాణ వస్తు - భావన తాఁ జేసెనూ
॥దేవుఁడందు ॥ ఉపపల్లవి॥

[5]విక్షేపాధిక కషాయ - విఘ్నముల గెలిచెనూ
సుక్షేత్ర [6]నేత్రాగ్ర లక్ష్య - సూక్ష్మమందు నిలిచెనూ
॥దేవుఁడందు॥ ౧

సర్వదృశ్య ప్రపంచ మ - సత్యమని యెంచెనూ
నిర్విశేషబ్రహ్మానంద - నిష్ఠచే దీపించెనూ
॥దేవుఁడందు॥ ౨

తరిగొండ నారసింహుఁడు - తానై ప్రకాశించెనూ
పరమమైనా నిర్గుణ సత్ - పద మవలంబించెనూ
॥దేవుఁడందు॥ 3

వ. ఇట్లు జగదీశ్వరుండు మఱపను తెర నుత్తరించి యీవల రాఁగాఁ జూచి విచారాత్మకుండనెడు ద్వారపాలకుండు కవాటంబుఁ దియ్యఁగా, నా స్వామి బహిర్లక్ష్యావరణంబులోఁ జొచ్చి పోవుచుండఁగాఁ జూచి శమ, విచార, సంతోష, సత్సంగంబు లనెడు [7]ద్వారపాలకులు స్వామినిఁ జూచి యిట్లనుచున్నారు: 7

---

5. విక్షేపాలయ కషాయ - క
6. నేత్రాక్ష్య లక్ష్య - ర
7. ద్వారపాలకు లందఱూ నా స్వామినిఁ జూచి - క

## దరువు, ఆదితాళం

బహుపరాకురా! హెచ్చరికె! - బహు పరాకురా! హెచ్చరికె!
బహుపరాకురా! హెచ్చరికె! - బహు పరాకురా! ॥పల్లవి॥

ఫాల మార్గమందుఁ జేరి - లోలక్ష్యమందంటి, ముక్తి
బాలను బొందే మా స్వామీ! - బహుపరాకురా!
॥బహుపరాకురా! హెచ్చరికె!॥ ౧

వికృతి కృత్యములఁ జాల - విపరీతముగాఁ బెంచే మూల
ప్రకృతినిఁ! బొందేవూ మా స్వామీ! - బహుపరాకురా!
॥బహుపరాకురా! హెచ్చరికె!॥ ౨

తరిగొండా వారాపింపహని - దగ్గర నుండే ముక్తిని
పరఁగాఁ బొందూ టరుదూ స్వామీ! - బహుపరాకురా!
॥బహుపరాకురా! హెచ్చరికె!॥ 3

## + జగదీశ్వరుఁడు - జ్ఞానకాంత +

వ. అని వారు హెచ్చరికలు దెలుపుచుండఁగా నా స్వామి లోఁగాఁ బ్రవేశించు సమయంబున జ్ఞానకాంత మధ్య లక్ష్యాంతఃపుర ద్వార కవాటంబు బంధింపఁగా, నా యీశ్వరుం డిట్లనుచున్నాఁడు: 8

జగః తే.గీ. ఏమె జ్ఞానశక్తి! యీ ముక్తికాంతను
వలచి యిటకు నేను వచ్చునపుడు
పటుకవాట మిట్లు బంధింపవలసిన
హేతువేమి తెల్పు మిందువదన! 9

వ. అనిన స్వామితో జ్ఞానకాంత యిట్లనుచున్నది:

---

8. ప్రకృతి సంచిక - ౪

జ్ఞాన: వినవోయి స్వామీ! యిప్పుడు మా ముక్తికాంత నిర్వికల్ప సమాధియందున్నది. నీ విప్పుడు బహుసంఘంబులతోడ వచ్చినావు గనుక, లోఁగాఁ బ్రవేశింపఁగూడ దో స్వామీ!

జగ: అయితే మంచిది . మీ ముక్తికాంత యిప్పుడెక్కడ మున్నది? ఆ వృత్తాంతంబు తెల్పవే!
అనిన జ్ఞానకాంత యిట్లనుచున్నది:

ద్విపద. 'విను దేవ! యిప్పు డా -వృత్తాంతమెల్ల
సమమాన విరహిత - మైన త్రికూట

పర్వతాగ్రమునందుఁ - బ్రజవాంతమైన
నిర్వికల్ప సమాధి - నిష్ఠ పెంపెసఁగఁ

బదిలమైనట్టి చిత్ - పదమునందంటి
కదలకున్నది ముక్తి - కాంత, నీ వివుడు

సకలసేనలఁ గూడి - సందడింపుచును
ప్రకటమై తగు మహా - ప్రభుశక్తి మెఱయ

వచ్చుటఁ జూచి యీ - వాకిలి వేసి
తిచ్చుట' నవఁగ న - య్యాశుఁ డిట్లనియె:

**దరువు. (తలుపు తీసెడు పాట)**

జగ: శ్రీకరముగ నేఁ జెందెద ముక్తిసతిని
వాకిలి దీయవె! జ్ఞానకాంతా! నీవు
వాకిలి దీయవె! జ్ఞానకాంతా! ౧

జ్ఞాన: ప్రాకటముగ సాధన శక్తినిఁ బొందక నీకు
ముక్తి యెట్ల సతిరేశా? యిపుడూ
ముక్తి యెట్ల సతిరేశా? ౨

జగ: నే నావరణ శక్తినిఁ బొందను జ్ఞానమానినీ!
తలుపుఁ దియ్యవే! జ్ఞాన మానినీ! యీ
తలుపుఁ దియ్యవే! జ్ఞానమానినీ! ౩

జ్ఞాన: నానా వింతలు చూపి నటియించే విక్షేపశక్తి
నే నీవు గూడు పోవోయీ! శక్తినే
నీవు గూడు పోవోయీ! ౪

జగ: ఏ పట్ల నన్నూ విక్షేప మంటదు, నీకూ
కోపమేలనే జ్ఞానకాంతా? నీకూ
కోపమేలనే జ్ఞానకాంతా? ౫

జ్ఞాన: ప్రాపై విక్షేపశక్తి ప్రబలి నిన్నంటకుంటే
పనులెట్లు పుట్టినోయీ స్వామీ? యీ
పనులెట్లు పుట్టినోయీ? ౬

జగ: విడకా విక్షేపశక్తి విశ్వాసమెల్లాను తానె
విరచించినాదే జ్ఞానకాంతా! తానే
విరచించినాదే జ్ఞానకాంతా! ౭

జ్ఞాన: జడమై విక్షేపశక్తి సకలప్రపంచమెట్లా
నడిపించు? నది జెప్పవోయీ! ఎట్లా
నడిపించు? నది జెప్పవోయీ! ౮

జగ: లలిని జ్ఞాతృత్వ బలంబూన విశ్వమెల్లా
కలిగించినాదే జ్ఞానకాంతా! తానే
కలిగించినాదే జ్ఞానకాంతా! ౯

జ్ఞాన: తలఁప నాకాశతత్త్వమూ జ్ఞాతృత్వమూ దాని
బలమూ, దీని కేమీ స్వామీ? దాని
బలమూ, దీని కేమీ స్వామీ? ౧౦

జగ: అనాఁడే విక్షేప శక్తికి బలా
మేనిచ్చినానే జ్ఞానకాంతా! బలా
మేనిచ్చినానే జ్ఞానకాంతా! ౧౧

జ్ఞాన: నే నిచ్చినాననీ నీటూగ నంటివైతే,
నీ వెవ్వ రది జెప్పవోయీ? స్వామీ!
నీ వెవ్వ రది జెప్పవోయీ? ౧౨

జగ: పొలఁతి! నన్నెవ్వరాని పూని యడిగితే, విరాట్
పూరుషుఁడనే జ్ఞానకాంతా! విరాట్
పూరుషుఁడనే జ్ఞానకాంతా! ౧౩

జ్ఞాన: అల విరాట్ పూరుషుఁడవైతే జాగ్రత్ప్రపంచా
మందంటియుందు వోవోయీ! స్వామీ! నీవూ
అందంటియుందు వోవోయీ! స్వామీ! ౧౪

జగ: ఇంతీ! యీ మాట కీ వెక నక్కెమాడే వైతే
హేమగర్భుఁడనే భామా! నేనూ
హేమగర్భుఁడనే భామా! ౧౫

జ్ఞాన: సంతోష మట్లానైతే స్వాప్నప్రపంచామందే
సంచరింపుచు నుండవోయీ! స్వామీ! నీవూ
సంచరింపుచు నుండవోయీ! స్వామీ! ౧౬

జగ: ఆ మాట కిటు పరిహాసక మాడేవైతే
అవ్యాకృతుఁడనే భామా! నేనూ
అవ్యాకృతుఁడనే భామా! ౧౭

జ్ఞాన: ఆ మాట్కి నవ్యాకృతుఁడవైతే సుషుప్తి సుఖమూ
ననుభవింపుచు నుండవోయీ! స్వామీ! అం
దనుభవింపుచు నుండవోయీ! ౧౮

జగ: కార్యకారణములాఁ గడచి వెల్గుచునుండే
తుర్యుఁడనే జ్ఞానకాంతా! నేనూ
తుర్యుఁడనే జ్ఞానకాంతా! ౧౯

జ్ఞాన: తుర్యుఁడవైతే నాతో మాటలాడఁగ రాదూ
తొల్లిటి రీతి నుండవోయీ! స్వామీ!
తొల్లిటి రీతి నుండవోయీ! ౨౦

జగ: మొనసి యిట్లాక్షేపములు మానీ, ముక్తి పతినీ
ననుఁ గూడనీవే! జ్ఞానకాంతా! నీవూ
ననుఁ గూడనీవే జ్ఞానకాంతా! ౨౧

జ్ఞాన: ఘన తారిగొండా స్వామి గతి యోగివైతే ముక్తి
కాంతను నీవు గూడవోయీ! స్వామీ!
ముక్తికాంతను గూడవోయీ! ౨౨

వ. అనిన విని యా స్వామి నవ్వి యిట్లనుచున్నాఁడు:

జగ: వినవే! జ్ఞానకాంతా! నేను యోగినయ్యే
ముక్తికాంతను గోరి వచ్చినానే భామా!

అనిన విని జ్ఞానకాంత జగదీశ్వరునితో నిట్లనుచున్నది:

జ్ఞాన: అహో! స్వామీ! నీవు జగజ్జన్మాది కారణుండవు. ప్రకృతి గుణ వ్యాపారంబులు జేసేవాఁడవు. ఆ ముక్తికాంతకు జగజ్జన్మాదిప్రకృతి గుణ వ్యాపారంబులు లేవు. నీవు సర్వజ్ఞుండవు. ఆ ముక్తికాంత సర్వజ్ఞత్వాతీత యైనది. నీవుబ్రహ్మాండాకారుండవు. ఆ ముక్తికాంత బ్రహ్మవేత్త. నీవు సర్వసాక్షిత్వ, కర్తృత్వ, భోక్తృత్వాద్యనేకోపాధులు గలవాఁడవు. అముక్తికాంత సర్వోపాధి విరహితయైనది. నీ వహంకార,మమకారంబులున్నూ గలవాఁడవు. ఆ ముక్తికాంత కవి లేవు.నీ వనంత కల్యాణ గుణంబులు గలవాఁడవు. ఆ ముక్తికాంత గుణాతీత గావున నిన్ను మెచ్చదు.

## + భక్తికాంత - జ్ఞానకాంత +

అనిన విని యప్పుడు భక్తికాంత యిట్లనుచున్నది: 11

### విలలు

భక్తి: శ్రీమహితా చారిత్రూనీ - చిదచిదీశ్వారూని పరుని
ఏమీ యాక్షేపింపుచున్నావే? వో వో జ్ఞానాకాంతా!
యిప్పటి వాకిలి దియ్యావే! ౧

జ్ఞాన: ఆక్షేపములు సేయాకానూ అనుమానములూ దీరాకానూ
మోక్షపతిని జూడానిచ్చేనా? వో వో భక్తికాంతా!
ముచ్చుమాటాలూ నే మెత్తూనా? ౨

భక్తి: జీవూని పారీక్షించినా చెలువునా ఈశ్వరూఁడైనా
దేవూని పారీక్షింతురేమె? వో వో జ్ఞానాకాంతా!
తెలిసి తెలియాఁజాలా విదియేమె? ౩

జ్ఞాన: ఇల జీవుఁ డవిద్యాబద్ధూఁ, డీశ్వరుఁడూ విద్యాబద్ధూఁ,
డిరువురికీ బంధామొకటేనే! వో వో భక్తికాంతా!
యిందుకై పారీక్షా జేసేనే! ౪

భక్తి: గజదంతా పారీక్షా సేయాఁగారా, దట్లా యీతని మాయాఁ
గని పరీక్షించేవారున్నారా? వో వో జ్ఞానాకాంతా!
కమలజాదూలయినాఁ గన్నారా? ౫

జ్ఞాన: కనరాని మాయామూ వెనుకా గని కూడియున్నాఁడూ గనుకా
మొనసి ముక్తిఁ బొందానియ్యానే! వో వో భక్తి కాంతా!
ముజ్జాగములా వేలూపొమ్మానే! ౬

---

9. ముక్తి వంటావియ్యానే! - ఠ

భక్తి: మూఁడూ లోకామూ లేలూనూ ముక్తికాంతానూ గూడూనూ
చూడూ మీ రెంటినీ విడువాఁడూ వో వో జ్ఞానాకాంతా!
సొలసి నీ మాటాల కోడాఁడూ ౭

జ్ఞాన: తరిగొండా నారసింహూని కరణీ యోగియైతే పూనీ
మురిసీ ముక్తి సతినీఁ గూడీనీ వో వో భక్తికాంతా!
మునుపటీ శక్తూలా వీడీనీ ౮

వ. అనిన విని భక్తికాంత యిట్లనుచున్నది:

భక్తి: నీ వీ జగదీశ్వరస్వామిని ఎట్లా పరీక్షింపఁగల? వది
చెప్పవే జ్ఞానకాంతా!

జ్ఞాన: అయితే వినుము. ఈ స్వామి యీశ్వరత్వాభిమానంబున
భేరీ భాంకారాది బిరుదు వాద్యంబులతోఁడ మహాపటాటోపంబుగా
మహదైశ్వర్యవంతుఁడై వచ్చినాఁడుగదా!ఈ పటాటోపమంతా తనదే
ననే యభిమానం వున్నదోలేదో అని మొదట పరీక్షించెద.

అని రహస్యంబుగాఁ జెప్పి, భక్తికాంతను వీడ్కొని వైరాగ్యకాంత
చెంతఁ జేరి జ్ఞానకాంత యిట్లనుచున్నది: 12

జ్ఞాన:ద్విపద.'వలనొప్ప వినఁగదే - వైరాగ్యశక్తి!
పొలుపొంద నమ్మహా - పురుషుఁ డిచ్చటికి

వచ్చి ముక్తినిఁ బొంద - వాంఛించినాఁడు
హెచ్చుగా జగముల - నేలుచున్నాఁడు

చెలఁగి యావరణ వి - క్షేప శక్తులను
కలిసియున్నాఁ, డిట్టి - గౌరవస్థితులఁ

గని మెచ్చు దా ముక్తి - కాంతాలలామ,
కనుక నీ ఘనుని యో -గ స్థితి, శాంతి

మొదలై ప్రకాశించు - మోక్షధర్మములఁ
జెదరని మతిఁ బరీ - క్షింపఁగా వలయు,

నెనవుగా నిఁక నేతి - నేతి వాక్యంబు
లనియెడి భటులచే - నతి తీవ్రముగను

వలనొప్ప నీ స్వామి - పరివారములను
తొలఁగక యిప్పుడే - త్రోపింపు మవల

మమతాహముల వీడి - మహనీయ శమము,
దమమును, నిస్పృహ - త్వము, చిత్త శాంతి

కలిగిన వాఁడై య - ఖండ భావనను
నిలిచియుండిన నీత - నికి ముక్తికాంత

దక్కు, నటావలఁ - దగిన ప్రయత్న
మెక్కువగాఁ జేసి - యేరీతినైనఁ

దరిగొంద నృహరికిఁ - దగఁజెప్పి ముక్తి
యరమరఁ దీర్చి, నె - య్యమున నిద్దరినిఁ

జెలువొప్ప నొకటిగాఁ జేసి, - యా వేద్య
సొలయక ముద్దుగాఁ - జూతమో యమ్మ'

వ. అనిన విని యప్పుడు వివేకశక్తి సహాయంబున వైరాగ్యశక్తి లేచి నేతి నేతి వాక్యంబులను భటులం దోడ్కొని చని, యా యీశ్వరోపాధి మాయా శక్తి కృతంబులైన త్రిగుణంబులను, త్రిగుణ కార్యాది సకల పరివారంబులను ద్రోపించె; నప్పు డా యీశ్వరుండు నిర్విచారుండై శాంతివహించి యూరకుండె.అది చూచి భక్తికాంత యిట్లనుచున్నది: 13

## రగడ

భక్తి: శ్రీమతి నీ వన్ని ద్రోపించినా రాగాదూలా వర్జించి
తేరకాఁడై దేవుఁడున్నాఁడే వో వో జ్ఞానాకాంతా!
ధీరుఁడై శాంతిఁ బొందినాఁడే! ౧

జ్ఞాన: శాంతిఁ బొందీ యున్నాఁడానీ సంతోషించే వంతేగానీ
యింతా మాత్రామునకే మెచ్చేనా? వో వో భక్తికాంతా?
యిప్పుడే ముక్తి నంటానిచ్చేనా? ౨

భక్తి: హేమాగిరితో కూచి గుట్టా యెదిరించి పోరాడే ననెడీ
సామెతాగాఁ బల్కుచున్నావే! వో వో జ్ఞానాకాంతా!
స్వామి మహిమా లేమీ గన్నావే? ౩

జ్ఞాన: నవ్వూలాకూ నే నిప్పు డన్నాదెగానీ, యీ దేవుని
యెవ్వారైనా పారీక్షించేరా? వో వో భక్తి కాంతా!
ఈతని మహిమాఁ గని నుతించేరా? ౪

తరిగొండ వారాహరికి తగఁజెప్పి ముక్తిపతికి
కరుణా నీ వింకాఁ బుట్టింపావే! వో వో జ్ఞానాకాంతా!
గ్రక్కునా జాబూ పంపింపావే! ౫

వ. అనిన విని జ్ఞానకాంత విజగురుండైన తరిగొండస్వామికి ముక్తికాంతకు సమ్మతిగాఁజెప్పి, ముక్తిపతిపేరిట జాబు వ్రాసి, శ్రద్ధయను దూతచేతఁ బంపఁగా, నది జగదీశ్వరుని చెంతఁ జేరి మ్రొక్కి, యిట్లనుచున్నది: 14

## దండకము

శ్రద్ధా: శ్రీమత్ పరంధామ! జీవావళీ స్తోమ! శ్రీమానినీలోల! శృంగార
నల్లీల! కందర్పలావణ్య! కంజోద్భవాగణ్య! షాడ్గుణ్య
సంపన్న!
సంరక్షితాపన్న! సత్యవ్రతాచార! సాధువ్రజోద్ధార! సారాంబుద
శ్యామ! సంపూర్ణ సత్కామ! వేదాంతసంచార! విశ్వంభరాధార!
శ్రీవేంకటాద్రీశ! సచ్చిత్ ప్రకాశా! పరాకాశ! లోకేశ! వాణీశ, గౌరీశ,
నా కేశవంద్యాంఘ్రిపద్మద్వయా! నిత్య సత్యాద్వయా!
సద్దయాసాంద్ర! యోగీంద్రహృత్పద్మ భృంగా!శుభాంగా!
సుచారిత్ర! మిత్రాబ్జనేత్రా! ధరిత్రీకళత్రా! -మహెరాల్లాన!
దానప్రియా! శ్రీనివాసా! మమున్ సత్కృపన్‌బ్రోవుమో తండ్రి!
తండ్రీ! తరిగొండధామా! నృసింహా! హృతాంహా! నమస్తే నమస్తే
నమస్తే నమ: 15

వ. అని నమస్కరించి జగదీశ్వరునికి లిఖితమియ్యఁగా, నా
స్వామి యా లిఖితంబు భక్తికాంత చేతికిచ్చి చదువుమనఁగా,నది యిట్లని
చదువుచున్నది: 16

## + ముక్తికాంత లేఖ +

భక్తి:ద్విపద. శ్రీమదఖండ సు - శ్రీయుక్తు లయిన
తామస రాజస - ద్వయ ముక్తులయిన

సహజ షడ్గుణులైన - సర్వజ్ఞులైన
బహుచరాచర భూత - పాలకులైన
సర్వకారణులైన - సర్వజ్ఞులైన
సర్వతోముఖులైన - జగదీశ్వరులకు

---

10. సర్వాత్ములైన - ?

భాసురమతి ముక్తి - భామ వందనము
చేశి, చేయంగల - చెలి విన్నపములు

విశదంబుగా మీరు - వినుఁ డాత్మయోగ
కుశలంబు మాకు, మీ - కుశలాతిశయము

వ్రాయించి పంపించ-వలయుఁ,దర్వాత
నా యందు నచ్చిదా - నంద సంపూర్ణ

శుద్ధ చైతన్య వ - స్తు స్వరూపమున
సిద్ధాంతముగఁ బొంది - చింత లేకుండి,

నన్ను బొంకించి, యా - నాఁ డెందు లేక
యున్న మాయాశక్తి - నొప్పి కూడితిరి;

కుదిరికె లేక నా - కు విరోధియగుచుఁ
జెదరుచు మించు వి - క్షేప సుందరిని

గలసి మీ చైతన్య - కళల ననేక
ములుగా విడిచి భూత - ములలోనఁ బొదివి

పరఁగ స్త్రీ పురుష రూ - పములుగాఁ దీర్చి.
కొఱగాని విషయసం - కుల వికారముల

తోడఁ బ్రహ్మాదులఁ - దొలుతఁ బుట్టించి,
యాద విద్యాఽవిద్య - లనెడి యుపాధి

భేదముల్ చాలఁ - గల్పించి విశ్వమును
బ్రోదిగా నిటు వృద్ధిఁ - బొందించినారు;

కావున ననుఁ బొందఁ - గాలంబు గాదు,
దేవ! మీ శక్తులం - దే రమింపుచును

పావనమగు మహా - ప్రళయంబు దనుక
నీ విశ్వమెల్ల మీ - రేలుఁడు! నేను

తరిగొండ పురినిఁ దత్ - పద లక్ష్యమంది
గుతి దప్ప కుండెద - గుప్త స్థలమునఁ

బన్నుగాఁ గరుణ నా - పై నుంచుఁడింత విన్నపంబులు
దేవ! - విమలస్వభావ!

వ. అని చదివిన జాబు తాత్పర్యంబు విని జగదీశ్వరుం డివ్యాశక్తిచేతఁ బ్రత్యుత్తరంబు వ్రాయించి పంపఁగా, నా ముక్తికాంత చెంతనున్న జ్ఞానకాంత యిట్లని చదువుచున్నది: 17

## + జగదీశ్వరుని ప్రత్యుత్తరము +
## సీసమాలిక

జ్ఞాన: సీ. శ్రీమదనంత తేజోమయాత్మకులైన
సర్వజ్ఞులగు మహాస్వామివారు
శ్రీమోక్షకాంత కాశీర్వాదములు పెక్కు
చిరకృపమీఱఁ జేసితిమి, మాకుఁ
గుశలమంతటను, నీ కుశలాతిశయములు
వ్రాయించి పంపింపవలయుఁ దెలియఁ,
దరువాత నీవు వింతగ వ్రాసి పంపిన
లిఖిత తాత్పర్యంబు లెన్న దెలిపె;
వే వావరణ ముఖ్య విఖిలశక్తులఁ గూడి
సృష్టి కల్పనముఁ జేసితి నటంచు
నీవు వాపై లేపి నిందఁ బుట్టించి శ
క్తులఁ బొందుమని యిట్లు తెలఁగఁ ద్రోయ

నీకు ధర్మము గాదు, నిను నేను మఱచుట
లేదు, శక్తులఁ బొందలేదు, నీవు
పరమోక్ష మందిర ద్వార కవాటంబుఁ
దీయింపవే! నన్నుఁ దేరపేయ

తే.గీ. రాదు, దోషంబు నా యందు లేదు; నాదు
నిశ్చలత్వంబు తరిగొండ నృహరి కెఱుక,
శాంత సుస్వాంత! గళిత సంసార చింత!
మూల నాదాంత విశ్రాంత! ముక్తికాంత! 18

వ. అని చదివిన జాబు విని, దానికిఁ బ్రత్యుత్తరంబువ్రాయించి, శ్రద్ధయను శక్తిచేతఁ బంపఁగా, నది జగదీశ్వరునిచెంతఁజేరి మ్రొక్కి యిట్లనుచున్నది: 19

శ్లో॥ సూర్యాదిగ్రహ తారకాంతరగతం సూక్ష్మాతి సూక్ష్మం జగత్
కార్యాకార్యావివేచనం మునినుతం కారుణ్య సద్వారిధిమ్।
తుర్యాతీత సమాధి పూర్ణమచలం దూరీకృతాఘం మహా
ధైర్యం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా॥ 20

## చూర్ణిక

శ్రీ మదఖండ బోధప్రద సకలనిగమ నిగమాంత శాస్త్ర పురాణేతిహాస ప్రతిపాద్య సచ్చిదానంద నిత్యపరిపూర్ణ దివ్యమంగళవిగ్రహం, కమలాపరిగ్రహం. ౧

ఉరుతరపాఠీన కమఠ వరాహ నరకంఠీరవ వటుక పరశుధర కోదండాభరణ సీరహస్త బుద్ధ కలికి ప్రముఖ వివిధావతారం, సుజన మందారం. ౨

సనక సనందన సనత్కుమార సనత్సుజాతాభిధాన పరమయోగీంద్ర కోపోద్దీపిత శాపసంజాత హేమాక్ష హేమకశిపు దశకంఠ కుంభకర్ణ శిశుపాల దంతవక్త్ర ధీకర గర్వాంధకార ప్రభాకరం, బృందారకజన శ్రీకరం 3

కమలగర్భ రుద్ర కశ్యప వసిష్ఠ శక్తి పరాశర వ్యాస శుక శౌనక గౌతమాంగిరసాత్రి భృగు భరద్వాజ నారద శ్రీవత్స కౌత్స జమదగ్ని వాలఖిల్య వాల్మీకి విశ్వామిత్ర ముఖ్య భక్తబృంద వందిత చరణారవిందం, జగన్మూలకందం. ౪

సహస్ర మార్తాండ ప్రభా భాసమాన నానామణిగణ ఖచిత నూపుర కింకిణీ మేఖలాంగద కంకణ కౌస్తుభ గ్రైవేయ హార కుండల మకుట దివ్యకనకాంబరాలంకృతం, దూరీకృతప్రాకృతం. ౫

శంఖ చక్ర గదా ముసల కౌక్షేయక ధనుర్బాణ ముద్గర భిండివాల పరశు పట్టిస పరిఘాద్యనేక దివ్యాయుధధరం, శత్రుజన వాతూల మహీధరం ౬

మగధ మాళవ మళయాళ చోళ నేపాళ కొంకణ ద్రవిడ టెంకణ సాళ్వ సౌరాష్ట్ర సౌవీర కురు కుకురు కోసల పుళింద లాట మరాట ఘోట కర్ణాట కాంభోజ కాశ్మీరాది సకలదేశాధీశ్వరాధీన సమస్త విత్తాపహరణం, సాధు సంపత్ కారణం ౭

నిరంతర కిసలయ పత్ర కోరక కుసుమ ఫల మిళిత విలసన్మహీజాత పరివృత శేషశైలాగ్ర శాతకుంభ కలశోన్నత ప్రాకార మంటపాలయ ద్వార కవాట శోభితానంద నిలయనివేశం, శ్రీవేంకటేశం౮

నిరుపమ నిరుపాధిక నిరాలంబ నిష్కళంక నిరామయ నిర్వికారాదిమధ్యాంత రహిత స్వయంప్రకాశం, తరిగొండ పట్టణాధీశం భజేఽహం భజేఽహం భజేఽహం భజేఽహమ్. ౯

వ. అని లిఖితమియ్యఁగా, ముక్తికాంత యిట్లని చదువుచున్నది:

## + ముక్తికాంత ప్రత్యుత్తరము +
### సీసమాలిక

భక్తి: సీ. శ్రీమదాశ్చర్య విక్షేప శక్తిప్రియు
లైన వర్ణిత మహిమాఢ్యులైన
కాలకర్మాధీన కామసంకల్ప సం
కలిత జీవ సమూహ కర్తలైన
రమణీయ జగదీశ్వర స్వామివారికి
"మూలనాద స్వాంత ముక్తికాంత
విమలభక్తిని( బదివేల వందనములు,
తరువాత తమ ప్రభుత్వంబు( జూచి
భూరి కిరీటాది భూషణంబులు చూచి
తళుకుల దివ్యవస్త్రములు చూచి
చక్క(దనము( జూచి చనువుగా( బొందు శ
క్తుల రీతి మిము నేను గూడరాదు;
నను( బొందవలసియుండిన గుణ కర్మాది
మాయాప్రపంచంబు రోయవలయు(,
జెదర కావరణ విక్షేప మూలములైన
వివిధశక్తుల పొందు విడువవలయు,
రహి గురుభక్తి వైరాగ్య విజ్ఞానాది
సాధుశక్తుల మైత్రి నలుపవలయు,
తెలిసి యంతర్బాహ్య దృశ్యశబ్దాను వి
ద్ధ సమాధి నిష్ఠల( దనియవలయు,
నిర్వికల్ప సమాధి నెతి నసంప్రజ్ఞాత
మనెడి సమాధులం దుండవలయు(,
దగిన సులీనతాదశ నముభూతి ర
సావేశమున( జొక్కినపుడు మీరు
నను( బొందవచ్చు; నిర్ణయముగా నిపుడు ప్ర

---

11. మూల సార స్వాంత ముక్తికాంత - శ

భృత్యాభిమాన విభూతి మెఱయ
రూప నామ క్రియా వ్యాపారములు మీరు
చేయఁ బూనుటను విక్షేపశక్తి
మీకుఁ గావలె, దాని పోకడల్ చూడను
నాకు సహింప దేనాటి,కందు
వలన నేఁ దరిగొండ వాసినై యుండెద
వెలయ సృష్టి స్థితి విలయములను

తే.గీ. మీరు చేయుచు నెపుడు నా మీఁదఁ గరుణ
చాల నుంచుఁడుఁ నా కంతె చాలు; నింత
విన్నపములు గుణాటోప! విశ్వరూప!
దళితసంతాప! వేదవిద్యాప్రదీప! 22

వ. అని చదివిన జాబు తాత్పర్యంబుఁ దెలిసి,ప్రత్యుత్తరంబు వ్రాయించి యా స్వామి పంపఁగా,జ్ఞానకాంతయిట్లని చదువు చున్నది: 23

## + జగదీశ్వరస్వామి రెండవ ప్రత్యుత్తరము +

జ్ఞాన: ద్విపద.శ్రీమన్ మహా నిర్వి - శేషాత్ములైన
కామాంధకార భా - స్కర రూపులైన

ప్రకృతి వికారాబ్ధి - బడబాగ్నులైన
వికృతి దుష్ట భుజంగ - విహగేంద్రులైన

అతిశయ షడ్భూమి - కాతీతులైన
సతత పూర్ణసమాధి - సంపన్నులైన

రహి రాజయోగీశ్వ - రస్వామి వారు
మహనీయ మతిని ని - ర్మల ముక్తిసతిని

దీవించితిమి; నేటి - దివసంబువరకు

పావన చైతన్య - పరవస్తువునకు

సంతోష, మిపుడు నీ - సంతోషమెల్ల
నెంత లేదనక ద్రా - యించి సంపింప

వలయు మా కిపుడె, త - ర్వాత నే నిన్ను
వలచి రాఁగా నీవు - వాకిలి వేసి

నా మోముఁ జూడకు -న్నావు, నే నంత
పామరుఁడను గాను, - ప్రకృతి బద్ధుఁడను

గాను, కాముకుఁడను - గాను, వికార
మాన రోష విషాద - మాత్సర్యములను

వీడి, నిశ్చలచిత్త - విశ్రాంతిఁ బొంది
నాఁడ, నీ విందుకు - ననుఁ బరీక్షించి

తప్పులేకున్న మీ - తరిగొంద కిపుడు
రప్పించుకొని నన్ను - రాజయోగాఖ్య

వరసుధాంబుధియందు - వాలలాడించు,
మరమరగాఁ జూడ - కతిశుభనామ!

సరస గుణస్తోమ! - సంపూర్ణ కామ!
చిర చిత్కళాధామ! - శ్రీమోక్షభామ!

వ. అని చదివిన జాబు తాత్పర్యంబుఁ దెలిసి, దానికిఁ బ్రత్యుత్తరంబు ముక్తికాంత శ్రద్ధయను శక్తిచేతఁ బంపఁగా, నది యా స్వామి చెంతఁ జేరి యిట్లనుచున్నది: 24

శ్లో॥ సత్యం జ్ఞాన [12]మనంతరూప మమలం చక్రాయుధం శ్రీకరం,
నిత్యం నిర్మల మవ్యయం నిరుపమం నిర్వాణ బోధప్రదమ్।
ప్రత్యక్షానుభవామృతం శుభకరం పాపాద్రి వజ్రాయుధం,
దైత్యారిం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం సదా. 25

**చూర్ణిక**

శ్రీమదచంచల జ్ఞానైశ్వర్యశక్తి బల తేజోవీర్యముఖ్యానంత కల్యాణ గుణగణాభిరామా! నీలతోయద ఘనశ్యామా! ౧

కాలప్రధానంతఃకరణాద్యనాది షట్క వినిర్మితాఖిల బ్రహ్మాండ భాండ సమూహ పరిపూరితోదరా! నీలాంబర సహోదరా! ౨

అవిద్యామాలిన్యకలిత రాగద్వేషాసూయా ప్రముఖ షోడశ వికార విరహిత జ్ఞాన ప్రకాశాతిశయ పరమభాగవత జన మనోంబుజ రాజహంసా! విదళిత మహారోష కంసా! ౩

నిరంతర కిసలయ పత్ర కోరక కుసుమ ఫల భరిత కదళీ నారికేళ పనసాశ్వత్థ పిచుమంద వకుళ వట కుటజ కురంటక కోవిదార మాలూర జంబీర హింతాల సాల రసాల పాటలీ పారిజాత పున్నాగ ముఖానేక తరు తృణగుల్మలతావృత శేషధరణీ ధరాగ్రనివాసా! మంగాముఖోల్లాస దరహాసా! ౪

బహుజన్మ భక్తి జ్ఞానవైరాగ్యాభ్యాస సంస్కార పరిపాక చరమ శరీరధరవార సంచితాగామిప్రారబ్ధ మదద్విరదాళి సింహా! తరిగొండలక్ష్మీనృసింహా! రక్ష మాం రక్ష మాం రక్ష మామ్. ౫

వ. అని లిఖితమియ్యఁగా, భక్తకాంత యిట్లని చదువుచున్నది 26

12. ముఖంతరూప మమలం - క

## + ముక్తికాంత రెండవ ప్రత్యుత్తరము +
## సీసమాలిక

భక్తి: సీ. శ్రీమన్మహామునిశ్రేష్ఠ పూజితులయిన
గురుతర కల్యాణగుణులు నయిన
సకలశక్తి సమేత జగదీశ్వర స్వామి
వారికిఁ బదివేల వందనములు,
తదనంతరమునఁ దత్త్వజ్ఞాన పరిపూర్ణ
రాజయోగులమని వ్రాసినారు,
దుష్టనిగ్రహమును శిష్టరక్షణమును
జేయుచుండెడి మీకుఁ జిత్త మెపుడు
గట్టిగా రాజయోగముమీఁద నాఁటదు
మీ, కది యేలన్న మెఱయ జనుల
విజ్ఞాపనంబులు విని వారలకుఁ దగు
నాజ్ఞాపనంబులు ననవరతము
గావించు మీ యందుఁ గర్తృత్వమున్నది,
యందుచేఁ దరిగొంద హరివిధమున
గురుతర రాజయోగులు మీరు గారని
తోఁచుచున్నది; మీరు దొడ్డవారె

తే.గీ. గాని కర్తృత్వమిటు మీకుఁ గలిగెఁ గనుక
మిమ్ము నేఁ బొందరాదు, నా మీఁదఁ గరుణ
చాల నుంచుఁడు నా కంతె చాలు; నింతె
విన్నపములు జగత్పూజ్య! వేదవేద్య! 27

వ. అని చదివిన జాబు తాత్పర్యంబు దెలిసి, క్రమ్మఱఁ బత్యు
త్తరంబు వ్రాయించి యా స్వామి పంపఁగా, జ్ఞానకాంత యిట్లని
చదువుచున్నది. 28

## + జగదీశ్వరుని మూడవ ప్రత్యుత్తరము +

జ్ఞాన:ద్విపద.శ్రీకర పరిపూర్ణ - చిద్వస్తువైన
ప్రాకటానంద స్వ - భావాత్ముఁడైన

"నిర్వికల్ప సమాధి - నిర్గుణుఁడయిన
సర్వాత్మకుఁడు మోక్ష - సారసేక్షణను

విదితంబుగాను దీ - వించితి మీవు,
తదనంతరమున మీ - తరిగొందనృహరి

కరణి నీ రాజయో - గ నునిష్ఠ నాకు
నరయఁగా లేదు పా - మ్మని వ్రాసినావు,

సంతోషమే, సరి! - సకలకర్తృత్వ
మాంతర్యమందు న - న్నంటి యున్నటుల

నీకుఁ దోఁచిన, దిది - నిజ మనరాదు
నాకు మాయకుఁ బొందు - నాటనుండియును

లే, దాకసమునందు - లేచిన మేఘ
మాదిత్యమండల - మావరించుకొని

యున్న చందంబుగా - నుండి లేకుండి
పన్నుగాఁ జిత్పర - బ్రహ్మమైయున్న

నన్నావరించి యు - న్నది గాని, దాని
నెన్నండు నేఁ బొంద, - నెపుడు నా యందు

---

13. నిర్వికల్పకుఁడైన నిర్గుణుఁడైన - శ

మాయా విశేష మ -ర్మ విలాసములను
తోయధి లోన బు - ద్బుదములు వొడము

కరణి నజాండముల్ - గల్గు, నందణఁగు,
మఱల జనించు; వి - మ్మాడ్కి విశ్వంబు

తానె జనించును, - తా నిల్చియుండుఁ,
దానే యణఁగు నీటి - తరఁగల రీతి;

నంతియే కాని న - న్నంటిలే దహము;
కాంత! యీ మాట ని - ష్కర్షయటంచు

బడబానలమునైనఁ - బట్టి మ్రింగెదను.
కడుమాటలేల శీ - ఘ్రంబుగా నిపుడు

తలుపుఁదీయించవే! - తత్త్వార్థసీమ!
సులలిత నామ! భా - సురముక్తి భామ!

## + విచారాత్మకుని హాస్యోక్తులు +

వ. అని చదివిన జాబు తాత్పర్యంబు ముక్తికాంత విని సమ్మతించి, 'కవాటంబుఁదియ్య'మనిన, విచారాత్మకుండనే ద్వారపాలకుండు హాస్యరసావేశుండై యా స్వామిచెంతఁజేరి యిట్లనుచున్నాఁడు: 29

క. దండమయా! జగదీశ్వర!
దండమయా! పూర్ణకామ! తారకనామా!
దండమయా! సర్వోత్తమ!
దండము సుగుణాభిరామ! తత్పదధామా! 30

వ. అని మఱి యిట్లను చున్నాఁడు:

ద్వార అహెరా! స్వామీ! మీరు రాజయోగులమని యనుకున్నారు గదా! రాజయోగికి మానావమానములందు తోష, రోషములు లేక సమచిత్తుఁడై యుండవలెను. కనుక యీ పరీక్ష చూడక నేను వాకిలి తియ్యను. 'అది యేమి పరీక్ష?' యంటిరైనా, మీరు 'బా'కేత్వంబియ్యవలెను. మీరు, బాకేత్వమిస్తిరైనా ముక్తికాంత 'దా'కు దీర్ఘమిస్తూవున్నది. మీరు బాకేత్వ మియ్యకుంటే మా ముక్తికాంత 'ధా'కుగుడియిచ్చి, 'పా'కోత్వ మిచ్చుచున్నది.కాఁగా ముక్తికాంత కావలసి యుంటే బాకేత్వ మియ్యుము.

అనిన నవ్వి యా యీశ్వరుండు వినోదంబుగా నిట్లనుచున్నాఁడు:

జగ: వినరా! ఓరీ! హాస్యకాఁడా! మాకు మాన, రోషాది ప్రకృతి వికారములు లేవు గనుక, బాకేత్వ మిచ్చే ముక్తికాంత చెంతకు వచ్చే నోయీ! 31

జగ: [14]క. బాకుం గుడు సిచ్చిన బీ,
బా కొనరఁగఁ గొమ్ము నిడినఁ బరువడి నది బూ,
బా కోత్వం బిచ్చిన బో,
బా కేత్వం బిచ్చి చాచి పలికిన నది బే. 32

వ. అనిన విని వాఁ డిట్లనుచున్నాఁడు:

ద్వార: అహెరా! స్వామీ! మీరు బాకు గుడుము, కొమ్ముసెత్వము, రెండేసి మార్లు ఉచ్చరించితిరైనా నా కది సంతోషము.

అనిన నవ్వి యా స్వామి యిట్లనుచున్నాఁడు: 33

---

14. చిన్నాటి నాడు ఓనమాలు కూడా గురువుల వద్ద అభ్యసించలేదని కంఠోక్తిగా నుడివిన మహాకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఈ పద్యంలో 'బ' కార గుణింతానికి సంబంధించిన అర్థ చమత్కృతిని మూడు కందపద్యాల్లో విగూఢంగా వెలార్చివుండటం అచ్చెరువు కలిగించే అపూర్వమైన సన్నివేశం!

జగ: క. బాకుం గుడియిద లీలీ,
బాకుం గొమ్మిడిన బూబు, పరువడి మఱియున్
బాకేత్వం బిడ బేబే,
బేకుం దీర్ఘంబు నిడిన బేబే బేబే. 34

వ. అనిన విని వాఁడు నవ్వి 'యహో! స్వామి! మీరు బాకేత్వ మియ్యకుంటిమాని గాని, బాకుం గుడును, కొమ్ము నేత్వము రెండేసి మార్లు వుచ్చరించితిరైనా నాకది సంతోష'మనిన, వానిం జూచి యా స్వామి వికావిక నవ్వి, వినోదంబుగా నిట్లనుచున్నాఁడు: 35

క. బాబల గుడుసులు లీలీ,
బాబల కొమ్ములును బూబు, పట్టుగ మఱి యా
బాబల కేత్వము లిడి, యా
బే బేలకుఁ బొల్లు లిడిన బేబే బేబే. 36

వ. ఇట్లు బాకేత్వం బిచ్చిన స్వామికి మ్రొక్కి ద్వారపాలకుఁడు మోక్షమందిర ద్వితీయ ద్వారకవాటంబుఁ దియ్యఁగా, నా స్వామి మధ్య లక్ష్యాంతఃపుర ద్వారంబులోఁ బ్రవేశించి పోవుచుండఁగా, ముక్తికాంత అంతర్లక్ష్యమందిర ద్వారకవాటంబు బంధింపఁగా, నా జగదీశ్వరుం డిట్లనుచున్నాఁడు: 37

## + జగదీశ్వరుఁడు – ముక్తికాంత +
## విలలు

జగ: శ్రీమానినీమణి! నిన్నెంతో ప్రేమామీరాఁగాను గూడే
నేమామూ మా గురుఁడూ దెల్పెనే! వో వో ముక్తికాంతా!
నేను నిన్నూ పొందియుండేనే! ౧

ముక్తి: శ్రీమహితామైనా పరమా శివయోగాఖ్యానమూ నీ వే
నేమమూనాఁ జేసివావోయీ? వో వో యోగిచంద్రా!
నీ విజామెల్లాఁ దెల్పావోయీ! ౨

జగ: అరుగూరి పొందూ విడిచీ అరు గుణాములు గడచీ
అరుగురిలో నేనూ గలసితి, వో వో ముక్తికాంతా!
అరుగురికి వరమూ దెలిపితి. ౩

ముక్తి: తెలిసీవా వాఁడానైతే నీ దేహములో నుండే మహిమా
సలలితముగా నాతో దెలుపరా! వో వో యోగిచంద్రా!
సమ్మతముగా నిన్నే పొందేరా! ౪

జగ: అంచాలంచాలా పద్మాములూ అయున్నావి, వాటి కవలా
మంచీ తేనే కొలనున్నాదే! వో వో ముక్తికాంతా!
పొంచీ పామూ కొలనూ గన్నాదే! ౫

ముక్తి: మిన్నూ లైదూ దాటి పందూ వెన్నెలా జూడాఁ గా నందూ
కిన్నేరా నాదా మదేమీరా? వో వో యోగిచంద్రా!
కినిసీ దానిలో నేముందూరా? ౬

జగ: వోహో! వినుమా! కిన్నేరాలో వోంకార స్వారూపమైనా
సోఽహమనే భావమున్నాదే! వో వో ముక్తికాంతా!
సొలసీ పవనూఁ దందే యున్నాఁదే! ౭

ముక్తి: ఈ విధామునా నుండే పవనూఁ దిరుగాడాలా నడిచీ కలసే
తావు విదానించీ చెప్పారా! వో వో యోగిచంద్రా!
తప్ప [15]కందాఁకా నే నొప్పేరా! ౮

జగ: పుండరీకామూనా కెగువా కొండాదారి మండే సిలా
మండలా మధ్యమూనాఁ గలసూవే! వో వో ముక్తికాంతా!
మానసా మచ్చుటవే పొలసూవే! ౯

ముక్తి: మదమూ మీఱాఁగానూ పెద్దా నదులూ రెండూ కలసివచ్చి
కుదురుగాఁ గూడే చోటేదిరా? వో వో యోగిచంద్రా!
గుఱుతూ విదానించి చెప్పరా! ౧౦

15. కందూవనే నే వొప్పేరా! - ౮

జగ: తన్మాయముగా గంగా యమునా తారకామండలమూ[16]తాఁకి
చిన్మయా పాత్రాలో నిండూనే! వో వో ముక్తికాంతా!
శివుఁడు దానీ నడుమా నుండూనే! ౧౧

ముక్తి: బ్రహ్మానందా బిందూవందే పద్మాములో [17]నిండి యుండూ?
బ్రహ్మమే కారాణి వెలుఁగురా! వో వో యోగిచంద్రా!
బ్రహ్మజ్ఞానివైతే తెల్పరా! ౧౨

జగ: బ్రహ్మానందా బిందూవూ సర్వప్రపంచా కారాణామగుచూ
బ్రహ్మరంధ్రా మందూ మెలఁగూనే! వో వో ముక్తికాంతా!
బ్రహ్మమే సాక్షిగా వెలుఁగూనే! ౧౩

ముక్తి: సంసారాసక్తిని వీడీ సకలా శత్రూవూల గడిచీ
హంసూఁడూ తానెందూఁ జేరూరా? వో వో యోగిచంద్రా!
ఆ రహస్యా మిపుడే దెల్పారా? ౧౪

జగ: మూఁడూ మూఁడూ దాఁటీ యవలీ మూఁడోమేడాఁ జేరీ యాత్మాఁ
గూడీ యానందింపూచుండూనే! వోవో ముక్తికాంతా!
కుదిరినా రహస్యా మింతేనే! ౧౫

ముక్తి: మంచిదైతే నింకా నొక్కా మర్మామూ నే నడిగేఁగానీ
పంచధారాణనఁగా నేమిరా? వో వో యోగిచంద్రా!
పట్టుగా నీ వాది దెల్పరా! ౧౬

జగ: పంచా భూతాములనూ తనలోఁ గాంచీ యైదూ నొకటి చేసి
మించీ యాత్మాఁ డవధారించితే వో వో ముక్తికాంతా!
పంచాధారాణనఁగాఁ బ్రఖ్యాతీ. ౧౭

---

16. దాఁటి - ర
17. నిలిచి యుండూ - ర

ముక్తి: భావనహితాముగా నిన్నీ భావాములు దెలిసీవాఫూ
భావారహితా మేదో దెలువరా! వో వో యోగిచంద్రా!
భావా మభావాములోఁ గలపరా! ౧౮

జగ: పొందూగానూ మేరూశిఖరామందీ, యవలా కలయాఁజూచీ
అందు భావాతీతామైవానే! వో వోముక్తికాంతా!
అంతటా నే నిండీయున్నానే! ౧౯

ముక్తి: ధీరా! నీవే తారిగొండా నారాయాణా గురుఁడా వైతే
రారా! నేనూ నీకూ మ్రొక్కేనూ వో వో యోగిచంద్రా!
రమణమీరా నీకుఁ దక్కేనూ ౨౦

వ. అనినమ్మతించి ముక్తినతి జగదీశ్వరునిఁ గూడియుండఁగాఁ జూచి, భక్తి, జ్ఞాన, వైరాగ్య శక్తులు మాగళంబులు పాడి; రది యెట్లనిన. 38

## + మంగళములు +

సద్గురు వరేణ్యునకు - జయ మంగళం
శ్రీ, సద్గురు వరేణ్యునకు - జయ మంగళం ॥పల్లవి॥

పరమ, చిద్గగనాత్మునకు సు - స్థిర మంగళం
శ్రీ, సద్గురు వరేణ్యునకు - జయ మంగళం ॥ఉప పల్లవి॥

సిద్ధాంత సిద్ధునకుఁ బ్ర - సిద్ధున కవ్యయునకూ
*శుద్ధచారిత్రనకు - శుభ మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౧

అద్వితీయునకుఁ బర - మాత్మున కచ్యుతునకూ
విద్వజ్జన వినుతునకు - విజయ మంగళం ॥ శ్రీ సద్గు॥

18 శుద్ధచైతన్యమునకు - శ

ప్రత్యగాత్మునకు సర్వ - పరిపూర్ణ ప్రకాశునకు
సత్య జ్ఞానానంతునకు - భవ్య మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౩

సంచితా గామి ప్రారబ్ధ - సంసార విదూరునకు
పంచకోశాధారునకు - భవ్య మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౪

రాజయోగీంద్రునకు సు - బ్రహ్మణ్యునకు సన్ముని
పూజితాంఘ్రి కమలునకు - భవ్య మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౫

భావా ఽ భావాతీతునకు - పరముక్తి సమేతునకు
దేవతాధి దేవునకు - పూర్ణ మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౬

సర్వ కారణునకు సర్వ - సాక్షికి సర్వజ్ఞునకు
సర్వేశ్వరస్వామికి - సతత మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౭

అకలంక హృదయునకు - అతిశయ సదయునకు
సుకవివరదునకు పరి - శుద్ధ మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౮

వర శేషాద్రి నిలయుఁడైన - తరిగొండ నరహరికి
శరణాగత త్రాణునకు - సర్వ మంగళం ॥ శ్రీ సద్గురు॥ ౯

క. అని వా రారతు లిచ్చిన
వెనుకను, తరిగొండపురిని వెలసిన మోక్షాం
గన నహిపర్వతమునఁ జే
కొని జగదీశ్వరుఁడు దానిఁ గూడి సుఖించెన్. 39

ద్విపద. శ్రీకర చరితుండు - చిదచిదీశ్వరుఁడు
ప్రాకట తరిగొండ - పట్టణాధిపుఁడు

తానైన శేషాద్రి - ధాముని చెంత
సానందుఁడై మహా - జగదీశ్వరుండు

ముమ్మూల కోనలో - మోక్షకామినిని
నెమ్మదిగాఁ గూడి - నిన్వృహొందయ్యె ;

నెవ్వా రెక్కడి సృష్టి - యక్కడ నిలిచి,
యొప్పుగా సకల జీ - వులు జ్ఞానులగుచు

## + మాయాశక్తి నాథుని వెదకుచు వచ్చుట +

ఘనముగా మోక్షమా - ర్గముఁ జూచుటెఱిగి
తనలోనఁ దానిట్లు - దలఁచె నా మాయ

'నా ప్రాణనాథుండు - నన్ను వంచించి,
యీ ప్రపంచ సుఖంబు - లెల్లను రోసి,

చక్కగా నెలయు సం - సారంబు విడిచి,
తక్కక మోక్ష కాం - తను గవగూడి

యున్నాఁడు గనుక, జీ - వులు నదే గతిని
పన్నుగాఁ గను తమ - బ్బని వలెఁ దాము
నన్ను బొంకించి యు - న్నత విరాగమునఁ
దిన్నగా నిపుడె ము - క్తి ప్రయత్నంబు

సేయుచున్నా రేమి - సేతు?' నటంచు
నా యెద శేషాద్రి - యందున్న విభుని

తప్పక తాఁ బొందఁ - దలఁపుచు లేచి
యప్పు డక్కడికి మా - యా శక్తి వచ్చె.

వ. ఇట్లు మా యా శక్తి వచ్చుటఁ దెలిసి జ్ఞాన, వైరాగ్య కాంతలు తమలోఁ [19]దా మిట్లనుచున్నారు: 40

---

19. దా మేమనుచున్నారు - ర

## దరువు

జ్ఞాన,

వైరాగ్య: మాయాశక్తి దా వచ్చెనమ్మా గుణముల మీఁది
మమతా దీనికి హెచ్చెనమ్మా ॥పల్లవి॥

పాయక వేంకట - రాయని కడ తమ
నాయకుఁడిపుడు - న్నాఁడని వెదకుచు ॥మాయా॥

॥ఉపపల్లవి॥

మోక్ష వ్యతిరిక్తములైనా వృత్తూలఁ బెంచి
మూర్ఖులా సంసారాబ్ధిలోనా
ఉక్షితిపైఁ దా నెప్పుడు ముంపను
దక్షత గల చిత్తానఖిఁ దోడ్కొని ॥మాయా॥ ౧

చెలఁగి సంకల్పాములాఁ జేసి, వికల్పాములాఁ
జేసి, సంశయాత్మకులాఁ జేసి
పలుమఱు జీవుల భ్రమ నొందించుచు
చలితులఁ జేసే స్వాంతాంగనతో ॥మాయా॥ ౨

శ్రీ తరిగొండా నారసింహుఁడూ
తానై దీపించి చెలఁగూచుండే శ్రీనివాసుఁడూ
ప్రీతిగఁ దన విపరీత కల్పనల
ఖ్యాతిగ మెచ్చును గద! యని మురియుచు ॥మాయా॥ ౩

వ. అని వారు పలుకుచుండఁగా మాయాశక్తి తన చెలులతో
నిట్లనుచున్నది:

## దరువు. ఆదితాళం

ఈశుఁ డేఁడే వో చెలులారా! ॥పల్లవి॥

జగదీశుఁ డేఁడే వోచెలులారా! ॥ఈశుఁ॥ఉపపల్లవి॥

ఈశుఁ డేఁడె నన్నెపుడేలుచు, విష
యాశల. కొస్పదుఁ డగుచు నటించే ॥ఈశుఁ॥ ౧

ఆనందమయుఁడై విశ్వాములోనా
నానా పనులకు ననుఁబురికొల్పే ॥యీశుఁ॥ ౨

తరిగొండ నృకేసరివలె వేంకట
గిరిపతి రీతిని కీర్తివహించే ॥యీశుఁ॥ ౩

వ. అని మాయాశక్తి పలుకుచున్న పలుకులు విని వైరాగ్యశక్తి దానికెదురుగా వచ్చి నిలిచినఁ, జూచి మాయాశక్తి యిట్లనుచున్నది: 41

## + వైరాగ్య శక్తి – మాయాశక్తి +

మాయా: అవునే! అమ్మయ్యా!

వైరాగ్య: యేమే! కొమ్మయ్యా!

మాయా: నీ వెవరే అక్కయ్యా?

వైరాగ్య: నేను వైరాగ్య శక్తిని; నీ వెవరే గిక్కయ్యా?

మాయా: నన్ను మాయాశక్తి యందురే కొమ్మా వో కొమ్మా

వైరాగ్య: యిక్కడికి యేల వచ్చినావే? తుమ్మా వో తుమ్మా

మాయా: నా ప్రాణనాయకుఁడైన జగదీశ్వరుని
వెదకవచ్చినానే! తల్లీ! ఓ తల్లీ!

వైరాగ్య: అయితే, అతఁడెక్కడ వున్నాఁడో వెదకుదువు గాని
రావే! మల్లీ! ఓ మల్లీ!

అనిన విని మాయాశక్తి కార్యార్థియై, రోషపడక, మిథ్యా
మైత్రితో నిట్లనుచున్నది: 42

## దరువు. ఆట తాళం

నా నాథుఁ డేఁడే ఓ యమ్మా? అమ్మా!
నా దేవుఁడేఁడేఁడే ఓ యమ్మా? ॥పల్లవి॥
ఇష్టముగా నన్నెపు డెడఁబాయక
సృష్టి కల్పనముఁ జేయుచునుండే ॥నా నాథుఁ॥ ౧

భూవలయాంబరముల నెలసిన బహు
జీవుల పాలనఁ జేయుచునుండే ॥నా నాథుఁ॥ ౨

తరిగొండనియెడి పురిలో వేంకట
[20]గిరిపతి రీతిని కీర్తివహించే ॥నా నాథుఁ॥ ౩

వ. అనిన విని వైరాగ్య శక్తి మాయశక్తినిఁ జూచియిట్లనుచున్నది:

వైరాగ్య: వినవే! మాయాశక్తి! యీ కొండమీఁద జగదీశ్వరుఁ
డుండే చోటు నే నెఱుఁగుదునమ్మా!

మాయా: నీవెఱిఁగియుంటివేని చూపవే! కొమ్మా!

---

20.గిరి పైద తాముక్తి పతిం బొందిన - ౪

వైరాగ్య: ఈ స్థలమందు ముక్తికి నివాసముగా నొక్క నిడివికొండ యున్నది. ఆ కొండ యెక్కేటందుకు ఆఱు మెట్లున్నవి. వాటిలో రెండు త్రోవ లున్నవి. ఆ త్రోవలలో రెండు గాలి భూతాలున్నవి. ఆ రెంటి నడుమ చక్కని మార్గమున్నది. దానిలోగా నొక్క సర్పము మొదటి మెట్టు దగ్గర పడిగెఁ బెట్టుకొని కడమెట్టు మీఁద తోఁకఁ బెట్టుకొని యున్నది. ఆ రెండు గాలిభూతాల సహాయము కడుపులోనికి చొరఁ దోలి, నీ వాగాలి భూతాలతోఁ గూడా నైదు మెట్లెక్కి పోగా, ఆఱోమెట్టు దగ్గర రెండు నల్ల కొండ లున్నవి. ఆ రెంటినడుమ సన్నపాటి దిడ్డి యున్నది. నీవాగాలి భూతాలతో కలిసి యా దిడ్డిలో దూరిపోయి, యందుండే త్రికూట పర్వతాగ్రముందుఁ జేరి, యందుండి మెల్లఁగా నా పై కొండకుఁబోతివైనా అక్కొంద చుట్టు చిన్న చిన్నవి వేయు కొండలున్నవి. వాటి నడుమ నొక్కచదరపుబండ యున్నది. ఆ బండమీఁద అమృతము స్రవిస్తూవున్నది. దానికి కొంచెము దిగువగా శింశుమారచక్రమున్నది. ఈ చక్రము తుదను హంసతూలికాతల్పమునందు ముక్తికాంతా సమేతుఁడై, సూర్య చంద్ర ప్రభామధ్యంబున నమృతపానముఁ జేసి, యోగనిద్రా పరవశుఁడై, సర్వసాక్షియై యుండే జగదీశ్వరునిఁ జూడవచ్చును. నీ వక్కడికి పోఁగలిగితే పోవే!

అనిన మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: వినవే! వైరాగ్య శక్తి! వేవక్కడికి పొయ్యేటందుకు చక్కని మఱియొక మార్గము చూపుము.

వైరాగ్య: వినవే! మాయాశక్తి! నీవా మార్గాన పోలేవు. అదియేల నంటి వేని మొదటి మెట్టు దగ్గఱ గణపతి, రెండవ మెట్టు దగ్గఱ ప్రజాపతి, మూఁడవ మెట్టు దగ్గఱ లక్ష్మీపతి, నాలుగవ

మెట్టుదగ్గఱ రుద్రుఁడు, అయిదవ మెట్టు దగ్గఱ సదాశివుడు, ఆఱవమెట్టుదగ్గఱ పరమాత్ముఁడు కావలిగా నున్నారు. లోఁగా విన్ను పోనియ్యరు. కాఁగా నీవు వచ్చిన త్రోవనే పోయేది మంచిది.

అనిన విని మాయాశక్తి వైరాగ్య శక్తినిఁ జూచి యిట్లనుచున్నది:

మాయా: ఓయమ్మా! యిట్లా చోటికి నేను పోనే లేను. ఈ జగదీశ్వరుఁడనే మగనికి ముగ్గురు బిడ్డలఁగంటిని. ఆ ముగ్గురు బిడ్డలు అర్గురు బిడ్డలఁ గనిరి. ఆ యార్గురు బిడ్డలు ఏడుగురుబిడ్డలఁ గనిరి. వారందఱు యెవరంటివేని సత్వుఁడు, రజుఁడు, తముఁడు - ఈ ముగ్గురూ నా కొడుకులు. కాముఁడు, క్రోధుఁడు,లోభుఁడు, మోహుఁడు, మదుఁడు, మాత్సర్యుఁడు - వీ రాఱుగురు నామను మలు.రాగుఁడు, ద్వేషుఁడు, ఈర్ష్యుఁడు, అసూయుఁడు, దంభుఁడు, దర్పుఁడు, అభిమానుఁడు, - ఈ యేడుగురున్ను నా మునిమనుమలు. ఈ పదార్గురినిచేతఁ బట్టుకొని అపార సంసారము చేస్తిని. ఇట్లా సంసారము చేస్తూన్నుండఁగా, మగఁడనే యనాథుఁడు కండ్లు మిఱకరిస్తూ చూస్తూవుండేదేగాని, మాతో కలిసిరాఁడు.

ఎట్లాగయినా ఒక మగఁడని యుంటే చాలునని, యా మగని ననుసరించుకొని నా సామర్థ్యముచేతనే సంసారము చేయు చుంటిని. ఇట్లా అనదయై యున్నవాఁడు ఊరక యుండక యిప్పుడు బిడ్డలఁ గని నన్నూరక విడిచి, బిడ్డలు లేని గొడ్డు మునలిదియయిన ముక్తికాంతను గూడి బతుకు బైటఁ బెట్టించి వాఁడు. బిడ్డలను ఏ దోవఁ బట్టించినాడో తెలియదు. ఆ మాట అడిగి తెలుసుకుందామంటె అతడు వుండే చోటికి పొయ్యే మార్గము కష్టముగా నున్నది. కాఁగా, ఇంక వేరే మార్గముంటే చూపుము.

వైరాగ్య: ఇంకా వేఱుగా నుండే మార్గము నాకు తెలియదు. ఆ మార్గము జ్ఞానశక్తి నడుగుము.

అనిన విని మాయాశక్తి జ్ఞానశక్తిని( జూచి 'సర్వేశ్వరుని దగ్గఱికి పొయ్యేటందుకు చక్కని మార్గము చూపు' మనిన జ్ఞానశక్తి యిట్లనుచున్నది:

జ్ఞాన: వినవే! మాయాశక్తీ! ఇప్పుడు వైరాగ్యశక్తి చెప్పిన మార్గానకు పడమరగా నొక్క సన్నపాటి గుహ యున్నది. ఈ గుహాద్వార మందు అడ్డపడి యొక చిన్ని పామున్నది. అది లో(గా యెవ్వరిని చొరనియ్యదు. కా(గా, ఆ మార్గము నీ కసాధ్యము. మఱి వేఱే మార్గము( జూపు మనిన ఈ గుహకు పడమరగా గణపతి యున్న మొదటి మెట్టు వెనుక( బుట్టి, యాఱు మెట్లు నానుకొని సన్నపు వేణుదండ మున్నది. దాని నడుమ చొర(బడిపోతే, దాని పైన గుమ్మడికాయంత నల్ల గుండున్నది. ఆ గుండును భేదించుకొని పైకి పోయితివైనా అక్కడ సర్వేశ్వరు(డున్నా(డు. ఆ స్వామి నక్కడ చూస్తివయినా నిన్ను నీవే మఱచి నీరస మయ్యేదేగాని, యిక్కడికి రాలేవు.

అనిన మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: వినవమ్మా! జ్ఞానశక్తీ! ఇప్పుడు నీవు చెప్పినది తన్ను మాలిన ధర్మము, మొదలు చెడ్డ బేరము గా నున్నది. నేనే నీరసమయ్యే చోటికి నేను పోను. నా బిడ్డలుండే చోటు నీవైనా చూపుము.

అన(గా జ్ఞానశక్తి దానిని( జూచి యిట్లనుచున్నది:

జ్ఞాన: వారలుండే చోటు నే నెఱు(గను. వైరాగ్యశక్తి నడుగుము.

అని తత్పూర్వవృత్తాంత మంతయు( జెప్ప(గా, మాయాశక్తి వైరాగ్యశక్తిని( జూచి యిట్లనుచున్నది:

## + మాయాశక్తి వైరాగ్యశక్తితో వాదించుట +

మాయా:

ద్విపద. వైరాగ్యశక్తి మా - వాంఛ్ర నందతిని
క్రూరతన్ చెఱఁబెట్టు - కొనివావు నీవు,

నా ప్రాణవిభుని న - వాథను జేసి,
ఈ ప్రపంచ సుఖంబు - లెల్ల రోయించి,

మునలి గొఱ్రాలైన - మోక్ష కామినినిఁ
బొనఁగ దగుల్ చేసి - పొమ్మనినావు;

పొలుపొందఁగా వృద్ధిఁ - బొందు జీవులను
చెలఁగి సన్న్యాసులఁ - జేయుచున్నావు.

కావున సంసార - ఘాతివై పుట్టి
నావు, శ్రీ తరిగొండ - నరహరి తోడె!

నీ బుద్ధి దెలిసెను - నినుఁ జూడనొల్ల,
నా బిడ్డలను దెచ్చి - నా కొప్పగించు.

వ. అనిన విని, వైరాగ్య శక్తి యిట్లనుచున్నది: 44

### దరువు. ఆటతాళం

వైరాగ్య: మూఁడు గుణంబులు - మూర్ఖ, కామాదులు
నేడ కేఁగిరో నది నే - నెఱుఁగనే మాయా!

మాయా: దొరకొని వారిని - దోఁచుక చన్నా నీ
వెఱుఁగా నంటె - పీడ నిపుడూ విరక్తి

వైరాగ్య: విడువానంటే నీకు - జడిసేది లేదూ, నీ
కొడుకూలఁ గని పట్టి - కొట్టేనే! మాయా!

మాయా: కొదుకులఁ గని పట్టి - కొట్టితే జగమూల
నడిపింప నెవ్వరు - న్నారె? విరక్తి! ౪

వైరాగ్య: నడిపింప కుంటేను - నా పేద బాయాను
పుడమి జీవులు ముక్తిఁ - బొందరే! మాయా! ౫

మాయా: అందాఱు ముక్తినిఁ - బొందితే సృష్టి యే
చందాన సాగు వి - చ్చటను విరక్తి? ౬

వైరాగ్య: సృష్టి సాగింపూచు - జీవూల నూరకే
కష్టపెట్టుట నీతి - గాదె వో మాయా! ౭

మాయా: కష్టము వారి కె - క్కడిది? స్త్రీ పురుషూలు
యిష్టముతోఁ గూడి - యిలలో నుండఁగనూ ౮

వైరాగ్య: ఇలలో నుస్థిరమూగ - నెప్పుదుండిన మేలె,
పొలుపారఁగా బుట్టి - గిట్టేదె కీదె! ౯

మాయా: పుట్టినవారెల్ల - గిట్టాకుఁడిన భూమి
పట్టా,దందున రెండూ - పనులు చేసేనే! ౧౦

వైరాగ్య: రెండూ పనులూ చేయు-చుండాకుంటే నేమి?
పొందేర కయినా నీ - పుత్రూలు, నీవూ ౧౧

మాయా: పొందు పొందని వాతో - పోరాదరాకు, మ
ట్లుందు, నన్నిప్పు - డుద్ధాడింపకవే! ౧౨

వైరాగ్య: ఉద్ధాడింపకనే నీ - యూరాట యేమే? నీ
దొడ్డ తనము దాలు - తొలఁగావే! మాయా! ౧౩

మాయా: తొలఁగామనిన నేను - తొలఁగేదానను గాను
వెలఁగి నే నిమఁ - జెఱచేనే! విరక్తి! ౧౪

వైరాగ్య: నా పాలి తరిగొండ - నరసింహుఁ డున్నాఁడు
పాప చింతలకు లోఁ - బడనీఁడే! మాయా! ౧౫

వ. అనిన విని, మాయాశక్తి వైరాగ్య శక్తినిఁ జూచి యిట్లనుచున్నది:

మాయా: నీవు పిట్టపిదుగు బ్రహ్మజ్ఞానముఁ జెప్పి వర్వేశ్వరునిఁ జెఱచితివి. మగఁడు విరక్తుడైనాను వా బిడ్డలనైనాను వా కొప్పగించుము.

అనగా వైరాగ్య శక్తి! యిట్లనుచున్నది:

వైరాగ్య: వినవే! మాయాశక్తి! నీ బిడ్డలూ, నీవూ పాపసృష్టిఁ
జేసి దుర్విషయ సుఖముల మరపి, జీవులను
నరకములలో ముంచుతున్నారు. కనుక మీ రింక
సృష్టికల్పనము సేయవద్దు.

అనిన మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: వినవే! వైరాగ్యశక్తి! కాలము, కర్మము, అవిద్య, జీవుఁడు, ఈశ్వరుఁడు, నేనున్ను షడవాదులమై సృష్టికి హేతుభూతులమై యున్నాము గనుక, యీ ప్రపంచంబు పొయ్యేది గాదు.

అనిన విని, వైరాగ్యశక్తి నవల నుంచి, జ్ఞానశక్తి మాయ నెదిరించి నిలిచి యిట్లనుచున్నది:

జ్ఞాన: వినవే! మాయాశక్తి! యీ ప్రపంచంబు పొయ్యేదిగా దంటివి. ఇది రజ్జువందు సర్పము, శుక్తియందు రజతము,ఎండమావుల యందు నీళ్ళును వుండి నట్లే వుండి యెట్లా లేకపోవునో, అట్లానే యీ ప్రపంచము లేకపోయినది. ఈ కన్నులకు కనిపించేదేమంటే జడమైన దృశ్యమేను. అది యెట్లాగంటే "యద్దృశ్యం తన్నశ్యం, యత్ కృతకం తదనిత్యం" - అనే వేదాంత శాస్త్ర వాక్య సమ్మతమై యున్నది.కాఁగా, బ్రహ్మము సత్యము, ప్రపంచము మిథ్య(అనిత్యము).

అనిన జ్ఞానశక్తినిఁ జూచి మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: వినవే! జ్ఞానశక్తి! ఘటపటాది రూపంబులు కండ్లకు కనిపిస్తూ న్నుండఁగా నీ వీ ప్రపంచ మనిత్య మంటివి. ఈ కండ్లకు కనిపించని బ్రహ్మము నిత్యమంటివి. ఇది నేను మెచ్చను.మతేమంటే కానరానిదేదో అదే లేనిది. కనిపించే బ్రహ్మమెక్కడ నున్నది? ప్రపంచమే యున్నది.

అనఁగా జ్ఞానశక్తి దానినిఁ జూచి యిట్లనుచున్నది:

జ్ఞాన: వినవే! మాయాశక్తి! అస్తి, భాతి, ప్రియాత్మకమయిన బ్రహ్మమే సత్యము; నామ, రూపాత్మకమైన ప్రపంచమే యసత్యము. అనఁగా, నది మొదలు కొని యిరువురు తర్కవేదాంతాది శాస్త్రాను సరణంబుగా వాదించిరి. అందు జ్ఞాన శక్తి గెలిచి మాయాశక్తిని తఱుముచు నిట్లనుచున్నది: 45

## + జ్ఞాన కాంత మాయను తఱుముట +
## దరువు. ఆదితాళం

పోవె! పోవె! మాయా! నో -బూటకంపు మాయా! ॥పల్లవి॥

జీవులాసైఁ గప్ప రాకే! - ఛీ ఛీ పోవె! మాయా!
॥పోవె! పోవె! ॥ఉపపల్లవి॥

వేలాను, వింగివి పీవె - పీచజాతి మాయా!
కాలా కర్మాదులఁ గడచి - కలసి మెలఁగే మాయా! ॥పోవె!॥ ౧

ఉండలేకా మెందుపోరే - ఖండవాది మాయా!
చండి గ్రహమట్లూ రాకే! - బండకూటి మాయా! ॥పోవె!॥ ౨

చిక్కులం మాటలాడకే! - చిప్పిలాఁడి మాయా!

## + మాయాశక్తి వేంకటేశ్వరునిఁ బ్రార్థించుట +

అని చెప్పి, దానిని ఆస్వామి సాన్నిధ్యంబునకుఁ దోడ్కొనిపోఁగా నది స్వామికి మ్రొక్కి యిట్లనుచున్నది: 46

## దరువు[21] ఆది తాళం

మాయా: పరాకు స్వామీ! బహు పరాకు రా!
పరాకు స్వామీ! బహు పరాకు రా! ॥పల్లవి॥

ధరాధరేంద్రోద్ధరా! పరాకు!
చరాచరాధీశ్వరా! పరాకు! ॥పరాకు స్వామీ! ॥ ఉపపల్లవి॥

శ్రీలలనాలలామా లోలా! పరాకు!
లీలా కల్యాణగుణ జాలా! పరాకు! ॥పరాకు॥ ౧

కారుణ్య రస పారావారా! పరాకు!
మేరూభూధర సమధీరా! పరాకు! ॥పరాకు॥ ౨

నిరుపమ శేషశైల నిలయా! పరాకు!
వర తరిగొండ నగర వాసా! పరాకు! ॥పరాకు॥ ౩

వ. అని వినుతింపుచుండఁగా, నా స్వామి భక్తికాంత మీఁది కావేశంబుగా వచ్చి యావేశమూరఁగాఁ, జూచి మ్రొక్కి మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: అహో! స్వామీ! నన్నునాథను జేసి ప్రథమపురుషుండైన వేంకటేశ్వరుఁడు ముక్తికాంతను మరగి, నన్ను విడిచిపెట్టినాఁడు.వైరాగ్య శక్తి నా బిడ్డలను యెక్కడెక్కడనో దాచినది. జ్ఞాన శక్తి నన్ను తిట్టుచుండఁగా భక్తికాంత నన్నవమానించి మీ సన్నిధికి తోడ్కొని వచ్చినది. కాఁగా, మీరే నన్ను రక్షింపవలెను.

---

21.ఆట తాళం - 6

## + మాయాశక్తి వేంకటేశ్వరునిఁ బ్రార్థించుట +

అని చెప్పి, దానిని ఆస్వామి సాన్నిధ్యంబునకుఁ దోడ్కొనిపోఁగా నది స్వామికి మ్రొక్కి యిట్లనుచున్నది: 46

### దరువు[21] అట తాళం

మాయా: పరాకు స్వామీ! బహు పరాకు రా!
పరాకు స్వామీ! బహు పరాకు రా! ॥పల్లవి॥

ధరాధరేంద్రోద్ధరా! పరాకు!
చరాచరాధీశ్వరా! పరాకు! ॥పరాకు స్వామీ!॥ ఉపపల్లవి॥

శ్రీలలనాలలామా లోలా! పరాకు!
లీలా కల్యాణగుణ జాలా! పరాకు! ॥పరాకు॥ ౧

కారుణ్య రస పారావారా! పరాకు!
మేరూభూధర సమధీరా! పరాకు! ॥పరాకు॥ ౨

నిరుపమ శేషశైల నిలయా! పరాకు!
వర తరిగొండ నగర వాసా! పరాకు! ॥పరాకు॥ ౩

వ. అని వినుతింపుచుండఁగా, నా స్వామి భక్తికాంత మీది కావేశంబుగా వచ్చి యావేశమాడఁగాఁ, జూచి మ్రొక్కి మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: అహో! స్వామీ! నన్నాతను జేసి ప్రథమపురుషుండైన వెంకటేశ్వరుఁడు ముక్తికాంతను మరగి, నన్ను విడిచిపెట్టినాఁడు.వైరాగ్య శక్తి నా బిడ్డలను యెక్కడెక్కడనో దాచినది. జ్ఞాన శక్తి నన్ను తఱుముచుండఁగా భక్తికాంత నన్నభిమానించి మీ సన్నిధికి తోడ్కొని వచ్చినది. కాఁగా, మీరే నన్ను రక్షింపవలెను.

---

21.అట తాళం - 6

## + శ్రీనివాసస్వామి "యూవేశము" - ఉపదేశము +

శ్రీవి(భక్తి):వినవే! మాయాశక్తి! ఆ పరమపురుషుండు ముక్తి కాంతను గూడి నిన్ను విడిచివాఁడనే చింత విడిచిపెట్టుము. నీవు చేసే పనులకు సహాయముగా అవ్యాకృతుఁడు, హిరణ్యగర్భుఁడు, విరాట్పురుషుఁడు యీ ముగ్గురువ్నారు. ఇది గాక, చిత్తకాంత,స్వాతకాంత నీ శిష్యులైయున్నారు. వారిని నీ వనుసరించుకొని, యవివేకుల నాశ్రయించుకొని యుండుము. ఌవివేకులై మోక్షేచ్ఛ గలిగిన నా భక్తులచెంత నీవుఁ జేరకుము. యథాప్రకారముగా నీయుద్యోగం నీవు చేస్తూన్నుండు పొమ్ము.

అనఁగా, మాయాశక్తి యిట్లనుచున్నది:

మాయా: ఆ నా ముగ్గురు కొడుకులు, నార్గురు మనుమలు, యేడ్గురు మునిమనుమలు నా దగ్గఱనే యుండవలెను. వారు నా దగ్గఱ నుంటే నేను వుద్యోగం సేతును.వారు లేకపోతే నా చేతఁ గాదు. అనిన, నాస్వామి యిట్లనుచున్నాఁడు:

శ్రీవి(భక్తి): వినవే! మాయాశక్తి! నీ బిడ్డలందఱూ వైరాగ్య శక్తిచేతఁ జిక్కి, తప్పించుకొనివచ్చి, సత్వుఁడనేవాఁడు నా దగ్గఱ దాఁగి యున్నాఁడు.రజుఁడనేవాఁడు బ్రహ్మదేవునిదగ్గఱదాఁగి యువ్నాడు. తముఁడనే వాఁడు శ్రీకాళహస్తీశ్వరుని దగ్గఱ దాఁగివాఁడు. నీ మనుమలు కామక్రోధాదులు, రాగ, ద్వేషాదులైన ముని మనుమలు యీ పదముగ్గురూ శుద్ధసంసారుల దగ్గఱ దాఁగియున్నారు. వారందఱూ జ్ఞాన, వైరాగ్య శక్తుల భయము చేత నిప్పు డెక్కడా కనపడరు. జ్ఞాన, వైరాగ్య శక్తులను పము దాయించి నా దగ్గఱ నుంచుకొనినదాఁకా వారందఱూ బైట సంచరింపఁగూడదు. నీవు పోయి నీ యుద్యోగంలో వుంటే వారందఱూ గత్వా, గత్వా వచ్చి, నీ దగ్గరనే చేరుతున్నారు. నీకు సహాయుఁడనయ్యే యుంటున్నాను. నీవు చింత సేయవద్దు.

అని సముదాయించి, పొమ్మనఁగా, నా స్వామికి ముక్తిమాయా శక్తి నిజేచ్ఛగా నరిగె. అంత జ్ఞాన, వైరాగ్య శక్తులు స్వామిచెంతఁ జేరి ముక్తి యిట్లనుచున్నారు: 47

## + జ్ఞాన, వైరాగ్యశక్తులు స్వామిని స్తుతించుట +

జ్ఞాన,వైరాగ్య:

శ్లో॥ ఆర్యాత్మాంబురుహాంతరంగ నిలయం హంసస్వరూపం లసత్
చర్యం సర్వమయం పురాణపురుషం సద్వర్గ గర్వాపహమ్।
శౌర్యాటోపసురారినిగ్రహ మజం సాధువ్రజోద్ధారణం,
స్థైర్యం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షం భజే౽హం సదా॥ 48

ద్విపద. శ్రీ యబ్ధిజాయత్త - చిత్తబ్జ భృంగ!
మాయాగుణ విభంగ! - మధుర ప్రసంగ!

అమలకీర్తివిశాల! - హరిహయ పాల!
కమనీయగుణజాల! - కరుణాలవాల!

జలరాశి గంభీర! - జగదేక వీర!
కలికలుష సంహార! - కనకాద్రి ధీర!

సరస సాధుత్రాణ! - సత్య కల్యాణ!
పరమ పద స్థాన! - పక్షీంద్ర యాన!

వైకుంఠ పురవాస! - వర దరహాస!
శ్రీకర సువిలాస! - శ్రీశ్రీనివాసా!

శరణు భక్తస్తోమ! - శరణు రిపు భీమ!
శరణు పావననామ! - సంపూర్ణ కామ!

శరణు లోకాతీత! - సత్య సమేత!
శరణు ధర్మోపేత! - సర్వ విఖ్యాత!

పాహి మాం - తరిగొండ పట్టణాధీశ!
పాహి శేషాద్రీశ! - పాహి మాం స్వామి!

వ. అని మతి న్నిట్లనుచున్నారు:

## + మాయాతత్త్వము +
## దరువు. అట తాళం

జ్ఞాన
వైరాగ్య: ఎక్కడఁ బుట్టెర! యీ మాయా? తుద
కెక్కడ లేక తొలఁగి పాయా. ॥పల్లవి॥

చిక్కులఁ బెట్టెర! యీ మాయా, దీని
చిత్రములన్నియు చెడిపాయా
॥మతి యెక్కడఁ బుట్టెర! యీ మాయా॥ ఉపపల్లవి॥

అది మూలమున లేదాయా, దీని
ఆదియు నింతింతన రాదాయా
భేదాస్పదములు తెఱచాయా, నిర్
భిన్నము భిన్నముల ట్లాయా ॥మతి యెక్కడ॥ ౧

ఉన్న దృశ్యమూ కాదాయా, లే
కుంటే తా దృశ్యంబాయా
తన్నే దా నెఱుఁగని దాయా, దీని
దంభము విస్తారంబా యా ॥మతి యెక్కడ॥ ౨

అంతా చిత్సాగర మాయా
యీ దేహంబులు బుద్బుద గతులాయా
అంతర్బాహ్యము లొకటాయా
అద్యంతంబులు గనరాదాయా ॥మతి యెక్కడ॥ ౩

నే నను వాఁ డెపుడో పాయా
నే ననువాఁడే నీవాయా

నేను నీవనుట లేదాయా
ఇన్నియు ఘనతర నిర్గుణమాయా ॥మతి యెక్కడ॥ ౬

పాప పుణ్యములు, భ్రమలాయా
తుద, బంధ మోక్షములు లేదాయా
రూప, నామములు కల్లాయా
ఆ, రూఢ చిదాత్మ నాజమాయా ॥మతి యెక్కడ॥ ౭

పోయెనటంటే పోదాయా
ఎప్పుడు గలదంటే లేదాయా
ఈ యాశ్చర్యము మెండాయా
ఇది యేమిర! శ్రీవేంకటరాయా? ॥మతి యెక్కడ॥ ౮

అండాండము లేకము లాయా
కడ. కంతా ప్రజ్ఞానంబాయా
పండు వెన్నెలే భ్రమలాయా
తరి, గొండ నృసింహుఁడె గురుఁడాయా ॥మతి యెక్కడ॥ ౯

వ. అనిన విని, జ్ఞాన శక్తిని఻ బిలిచి, యావేశమాడె శ్రీనివాసుఁ
డిట్లనుచున్నాఁడు: 50

## + శ్రీనివాసుని సందేశము +

శ్రీని (భక్తి):
ద్విపద. 'విను జ్ఞానశక్తి! యీ - వృత్తాంత మెల్ల
ఘన సచ్చిదానంద - ఖని నగుచున్న

నా యందు మాయ యీ - నామ, రూపములఁ
బాయక పుట్టించుఁ, - బాలించు, నణఁచు;

దాని మహత్త్వ మిం - త యటంచుఁ దెలిపి
పూని బ్రహ్మైనను - పొగడఁగాఁ గలఁడె?

అటువంటి మాయ నిం - దను తగఁజేసి
తటుకున నీవేల - తతిమితి?' వనుచు

దానిఁ దప్పులఁ బట్టి - తరిగొంద వానుఁ
దైనట్టి శ్రీవేంక - టాద్రి నాయకుఁడు

తన చెంత నపుడు త - త్వ జ్ఞాన శక్తి
నొనరిన దయను దా - నుంచుక యుండె.

వ. అప్పు డా రీతిఁ దెలిసి, వైరాగ్య శక్తి వివేకశక్తినిఁ జూచి యిట్లనుచున్నది: 51

వైరాగ్య:
ఆ.వె. ఓ వివేకశక్తి! శ్రీవేంకటేశుండు
మాయమీఁదఁ జాల మమత నుంచి
జ్ఞానశక్తి కేమొ తా నుపదేశంబుఁ
జేసి యాశ కిరవుఁ జేసెఁ గదవె? 52

## దరువు. [22] అటతాళం

ఛీ! ఛీ! యాశకన్న చెడుదీ లేదమ్మా!
యాచించుఁ గాని నన్నంట దో యమ్మా! ॥ఛీ! ఛీ!॥ ౧

మాయా నీ దేవుఁడు మరిగినాఁడమ్మా!
తా యాచకము సేయఁదలఁచినాఁడమ్మా! ॥ఛీ! ఛీ!॥ ౨

భక్తి, జ్ఞానములాఁ జేపట్టినాఁడమ్మా!
యుక్తికాఁడే కాని, యోగి కాఁడమ్మా! ॥ఛీ! ఛీ!॥ ౩

వైరాగ్య మితఁడు గావలె ననఁడమ్మా!
భూరి విత్తాశ లోఁబొందినాఁడమ్మా! ॥ఛీ! ఛీ!॥ ౪

22. అది తాళం - ౮

తరిగొండా స్వామీ విత్తము( గోర(దమ్మా!
అరయా నీ స్వామి విత్తానక్కు(దమ్మా! ॥ఛీ! ఛీ!॥ ౫

వ. అహహా! వివేకశక్తి! యీ వేంకటేశ్వరు(డు బహుధనానక్కు(డై యందఱినిన్ని ఆవేశాలాడించి, అర్థము సంపాదించి బలుపెద్ద సంసారి యైనా(డు. ఇతని దగ్గఱ నే నుంటినైనా నాకున్నూ ద్రవ్యాశ పుట్టును. నా కున్నూ ద్రవ్యాశకున్నూ తేజస్తిమిర న్యాయముగా నున్నది. కా(గా నే నీ యాశలు గలిగిన చోట నుండ నెఱతు. ఇప్పుడు నన్నెక్కడ నుండమనేవు చెప్పుము.

అనిన వివేక శక్తి యిట్లనుచున్నది:

వివేక: వినవే! వైరాగ్య శక్తి! భక్తి, జ్ఞాన శక్తు లెక్కడ నుంటే యక్కడ నేనుండవలెను. వా రిద్దఱు నీ స్వామి నాశ్రయించి యున్నారు. నేనున్న వారిద్దఱి చెంతనే యుండవలెను. ఈ ముగ్గురూ లేకుండా నీ వొక్కతెవే యెక్కడకు పోయినా వేషభాషలచేత నపకీర్తిని( బొందేవు. ఎక్కడ( జూచినా యాశలేనివారు లేరు. ఆశలేని చోటేదంటి నైనా నిర్గుణ పరబ్రహ్మమైన సద్వస్తువం దాశ లేదు.నీ వక్కడకు చేరవలసియుంటే నీవు స్వతంత్రముగా పో(గూడదు. ఈ శ్రీనివాసస్వామే నిన్నక్కడ నిల్పవలెను.

అన(గా విని వైరాగ్య శక్తి సమ్మతించి, యావేశమాడే శ్రీవేంకటేశ్వరస్వామితో నిట్లనుచున్నది: 53

## + వైరాగ్యశక్తి విన్నపము +

క.వైరాగ్య:దండమయా! సద్గురువర!
దండమయా! పూర్ణకామితప్రద! సదయా!
దండము తరిగొండాధిప!
దండము శేషాద్రి ధామ! దైవలలామా! 54

## దరువు. రేగుప్తి రాగం - ఆదితాళం

సద్వస్తువులోనే నిల్పర! నను సద్గురు నారాయణదేవా!
॥పల్లవి॥

అద్వయమై, పరమామృతమై, ఘన
విద్వన్నుతమై వెలుఁగుచునుండే పర ॥సద్వస్తువులోనే॥
॥ఉపపల్లవి॥

ఇరువది యైదిటిఁ గూడి జనించిన
యీ స్థూలాంగము నే నొల్లా
చొరవఁగఁ బది యేడింటినిఁ గూడిన
సూక్ష్మ శరీరము నే నొల్లా
గరిమ నవిద్యాకరమై వెలిఁగెడి
కారణ తనువును నే నొల్లా
నరవిని జాగ్రత్ స్వప్న సుషుప్తుల
జాడల నొందుటనే నొల్లా, పర ॥సద్వస్తువులోనే॥ ౧

సారెకు జననమరణముల కిరవగు
సంసరణంబును నేనొల్లా
భూరిసుఖంబును దుఃఖము నొసఁగెడి
పుణ్యపాపములు నే నొల్లా
జాతి మరల దిగఁబడ హేతువులగు
స్వర్గ నరకములు నే నొల్లా
తీర నణుత్వంబునఁ దెగనియ్యని
దివ్యపదంబులు నే నొల్లా, పర ॥సద్వస్తువులోనే॥ ౨

ఖరకర మండల ముఖమండలములు
కలసి మెలంగుట నే నొల్లా
పరఁగ మహాప్రళయములను మూల

ప్రకృతినిఁ బొందుట నే నొల్లా
తిరుగా సృష్ట్యాదుల నుదయించే
దీనదశల నిఁక నే నొల్లా
తరిగొండ నృకేసరి యగు వేంకట
గిరివర!నిన్నింకవిడువఁగ నేనొల్లా,పర ॥సద్వస్తువులోనే॥ ౹

వ. అనిన విని వేంకటేశ్వరుం డిట్లనుచున్నాఁడు:

శ్రీవి(భక్తి):వినవే! వైరాగ్య శక్తి! ఆశలు గలిగిన చోట నీవుండవు గదా! సంతోషమాయెను. నీవు కోరిన ప్రకారముగా నిన్ను సద్వస్తు వందు నిల్పేది నా భారమవుచున్నది. ఇప్పుడు ఈ వివేక, జ్ఞాన శక్తులతోడఁ గొన్నాళ్లు మావద్ద నుండుము. దానికిఁ దఱి వచ్చి నప్పుడు నిన్ను సద్వస్తువులో నిలుపుచున్నాము. నీవు చింతసేయవద్దు.

అని బహుప్రకారములుగా నమ్మిక లిచ్చిన, వైరాగ్య శక్తి సంతోషించి, యా రాత్రికంబు గైకొని మంగళంబులు పాడు చున్నది. అది యెట్లనిన. 55

## + మంగళములు +
## సురటిరాగం

వైరాగ్య: మంగళం, మంగళం నృసింహ! తే మంగళం ॥పల్లవి॥

మంగళ ప్రద! విహంగ వాహన! భు
జంగశయన! భవభంగా! అ
నంగజనక! సారంగ వరద! యోగి
పుంగవాత్మ కమలభృంగ! దివ్యాంగా! ॥మంగళం॥ ౧

ధీర! మందరోద్ధార! నిగమ సం
చార! జలధి గంభీరా! శృం

గార పూరితాకారా! శ్రీమనో
హార! సద్భక్త మందార! చిత్సారా! ॥మంగళం॥ ౨

శ్రీ యహోబలేశ! శేషశైలాధీశ!
నా యాశ! తరిగొండ నాథా! ప
ద్మాయతేక్షణ! విధేయ నిర్జర స
హాయ! దూరీకృతమాయ! మునిగేయా! ॥మంగళం॥ ౩

వ. అని మంగళంబులు పాడి, జ్ఞానశక్తితోడ స్వామికి మ్రొక్కి వైరాగ్యశక్తి యిట్లనుచున్నది: 56

## దరువు

వైరాగ్య: ఆనంద మానంద మానందమూ
పర, మానంద మాయెర! నీ యావేశమూ ॥పల్లవి॥

బ్రహ్మాండ కోటులం దీ యావేశమూ
నిండి, పండి దీపించె నీయావేశమూ ॥ఆనంద॥ఉపపల్లవి॥

చల్లఁదనమైన నీ యావేశమూ, ప్రజ
కుల్లాస మిచ్చెరా! నీ యావేశమూ ॥ఆనంద॥ ౧

ఎంతో వింత లాయెర! నీ యావేశమూ
వేంకటేశ! శాంతిఁ బొందింపు మావేశమూ ॥ఆనంద॥ ౨

తరిగొండా నారసింహుని యావేశమూ, సర్వ
పరిపూర్ణ మాయెర! నీ యావేశమూ ॥ఆనంద॥ ౩

ఆ.వె. అనుచు వారు మ్రొక్క నా వేంకటేశుండు
మెఱసి భక్తికాంతమీఁదనుండి

స్వస్వరూప మొంది, సకల శక్తులఁ గూడి
యిరవుగాను జగము నేలుచుండె. 56

# అంకితము

ద్విపద. అని యిట్లు శేషాచ - లాధీశుఁడగుచుఁ
దను నేలు తరిగొండ - ధాముని పేర

నిర్వాణపదమార్గ - నిర్ణేతయైన
సర్వేశ్వరునిపేర - సద్గురు పేరఁ

[23]దనివొంద ముక్తికాం - తా విలాసంబు
నను కృతిఁ జేసి బ్ర - హ్మానందమందుఁ

గుదిరి సుబ్రహ్మణ్య - గురువర్య దివ్య
పదయుగళికి సమ - ర్పణముఁ గావించె.

ఇది పఠించినవారు - నిది విన్నవారు
నదరక మోక్షర్పు - లై సుఖింపుదురు.

భూచక్రమున నిది - పూర్ణమై వెలసి
యాచంద్ర తారార్క - మై యుండుఁ గాత!

॥కృష్ణార్పణ మస్తు॥ శ్రీ తరిగొండ లక్ష్మీనృసింహాయ నమః॥

---

23. తనివొప్పు - ర

## వ్రాయసకాని విన్నపము:

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౭౭౦ అగువేటి కీలక వామ సంవ్వతరం చైత్రశుద్ధ యేకాదశి శుక్రవారంవరకు శ్రీ కరణకులోద్భవులైన సరవ్వతి కంఠాభరణులైన కౌశికమ గోత్రం బోధాయన సూత్రం ఉత్తరమేలూరు తిరుపతి స్థలకరణం పుదుక్కుడి చంగల్రాయ పిళ్ళ పౌత్రులైన వెంకట్రాయ పిళ్ళ ప్రథమ పుత్రుడైన క్రిష్ణాపురం సంప్రతి శేషాచలం శ్రీతరిగొండ వెంగమాంబా ప్రణీతంబైన ముక్తికాంత విలాసం మాతృకలో వున్నమట్టుకు సంపూర్ణముగా వ్రాశినది.

శ్రీ మంగళ మహా శ్రీశ్రీశ్రీశ్రీ జేయునూ.

క. ప్రతి జూచి వ్రాశివాడను
అతిశబ్రలు వ్రాలు జూడ అన్నియు తప్పల్
యతి గణము యేమి యరుగను
మతిమంతులు తప్పుదిద్ది మన్నించరయా!

శ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీ రామార్పణమస్తు. శ్రీః.

T.T.D. Religious Publications Series No. 777
Price Rs.



Published by Sri K.V. Ramanachary, I.A.S. Executive Officer
T.T.Devasthanams, Tirupati and Printed at TTD Press, Tirupati